


# మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

MJP NEWS TELUGU


సంపుటి : 6 సంచిక : 68 పేజీలు : 8 వెల : రూ.2/- ఆదివారం 05 ఏప్రిల్ 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## అమరావతి నిర్మాణంలో

# జాప్యం సహించను

- చకచకా పనులు సాగి తీరాల్సిందే
- అధికారులు, కాంట్రాక్ట్ సంస్థలకు ఆదేశం
- అమరావతి చరిత్రలో అందరూ భాగస్వాములే
- నిర్మాణ పనులపై సమీక్షలో సిఎం చంద్రబాబు



**అమరావతి,మన జనప్రగతి ఏప్రిల్ 04:** రాజధాని అమరావతి పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థల తీరుపై ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి నిర్మాణాలు పూర్తి చేసి తీరాల్సిందే అని ఆదేశాలు జారీ చేశారు. రాజధాని నిర్మాణ పనులపై సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిర్మాణాలు చేస్తున్న కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు, పలువురు అధికారులపై ఆయన సీరియస్ అయ్యారు. అలాగే రాజధాని అమరావతి నిర్మాణ ప్రాంతాల్లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాలపైనా సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ సందర్భంగా నిర్మాణ సంస్థల తీరును తప్పుపట్టారు. నిర్మాణ సామగ్రికి రక్షణ కల్పించే బాధ్యత కాంట్రాక్ట్ సంస్థలకు లేదా? అంటూ ఆయన ప్రశ్నించారు. కాంట్రాక్ట్ సంస్థల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వంపై విమర్శలు వస్తున్నాయని ఆగ్రహించారు. ఘటన తర్వాత కూడా కాంట్రాక్ట్ సంస్థలు, అధికారులు సరిగా స్పందించలేదని మండిపడ్డారు. రాజధాని నిర్మాణానికి ఇసుక, గ్రావెల్ సరఫరాలో ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను మిగతా2లో...




## దక్షిణాది రాష్ట్రాలకు

# అన్యాయం జరగదు

- సీట్లు కోల్పోతామన్న వాదనలో అర్థం లేదు
- కేరళ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ

**తిరువనంతపురం,మన జనప్రగతి ఏప్రిల్ 04:** జనాభా నియంత్రణతో దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభ స్థానాలు కోల్పోతాయంటూ చేస్తున్న వాదనల్లో నిజం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. కొందరు కావాలనే ఈ వాదనను తెరపైకి తెచ్చారని అన్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ అధికారంలోకి వస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఎల్డీఎఫ్ ఉద్వాసనకు కౌంట్‌డౌన్ మొదలైందని చెప్పారు. తిరువళ్లలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో మోదీ మాట్లాడుతూ, కేరళ అభివృద్ధిపై కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి ఎన్నడూ దృష్టి పెట్టలేదని, 2004-2014 మధ్య కేరళ అభివృద్ధికి అప్పటి కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం కేటాయించిన మొత్తం కంటే తమ ప్రభుత్వం ఎక్కువ కేటాయించిందని చెప్పారు. 'ఇంతకుముందు కూడా ఇక్కడకు వచ్చాను. కానీ ఈసారి అన్నివైపుల నుంచి మార్పు కోరుతున్న మిగతా2లో...



## గడవు ముగుస్తోంది...

### - ఇరాన్‌కు మరోమారు ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్,మన జనప్రగతి ఏప్రిల్ 04:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి వార్నింగ్ ఇచ్చారు. తమతో ఒప్పందం చేసుకోవడానికి లేదా హర్మూజ్ జలసంధిని తెరవడానికి ఇరాన్ కు ఇచ్చిన పది రోజుల గడువు దగ్గరపడిందన్నారు. సమయం మించిపోతోందని, మిగతా2లో...

## 28 జిల్లాలతో కొత్తగా

# ఎపి మ్యాప్ విడుదల

- అమరావతి ప్రాంతానికి ప్రత్యేకంగా గుర్తింపు





2లో

# ఎఐ వైపు ఐటీరంగం పరుగు

- మార్పులకు అనుగుణంగా మారాలి
- సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి
- ఎఐ సమ్మిట్‌లో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర




**అమరావతి,మన జనప్రగతి ఏప్రిల్ 04:** ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వైపు ఐటీ రంగం వేగంగా మారుతోందని ఆంధ్రప్రదేశ్ గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. దీనికి అనుగుణంగా మన మానవ వనరులకు తగిన శిక్షణ ఇవ్వడం చాలా అవసరమని మంత్రి అభిప్రాయపడ్డారు. అమరావతి రీజియన్‌లో ఏఐ సమ్మిట్‌ను మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. కృత్రిమ మేధపై మిగతా2లో...

## మహారాష్ట్రలో

# ఘోర ప్రమాదం

- బావిలోకి దూసుకెళ్లిన కారు
- ఒకే కుటుంబానికి చెందిన 9మంది మృతి



**ముంబై,మన జనప్రగతి ఏప్రిల్ 04:** మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ఉన్న 9 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారని మృతుల బంధువులు తెలిపారు. నాసిక్ జిల్లా డిండోరీ తాలూకాలో ఈ ప్రమాదం జరిగింది. శివాజీ నగర్‌లో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి తమ స్వగ్రామానికి వెళుతుండగా వారిని మృత్యువు కబలించింది. వివరాల్లోకి వెళ్తే.. నాసిక్ జిల్లాలోని డిండోరీ ప్రాంతానికి చెందిన సునీల్ దత్తాత్రేయ దర్గుడే (34).. తన భార్య రేష్మా దర్గుడే (30), కుమార్తె రాఖీ అలియాస్ గుణవతి దర్గుడే, వదిన ఆశా దర్గుడే (32), ఆమె కుమారుడు శ్రేయాస్ దర్గుడే, కుమార్తె శ్రిష్టి దర్గుడేతో కలిసి కారులో శివాజీనగర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన మిగతా2లో...

## అమరావతి పేరుతో

# ప్రజలపై భారం

- భారం కాకూడదన్నదే జగన్ ఆలోచన
- చంద్రబాబు పదేపదే అబద్ధాలతో మోసం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి



**అమరావతి,మన జనప్రగతి ఏప్రిల్ 04:** అమరావతిపై ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. చంద్రబాబు పదేపదే చెప్పిన అబద్ధాలే చెబుతున్నారని విమర్శించారు. అమరావతి రాజధాని అంశంపై తాడేపల్లిలో సజ్జల రామకృష్ణారెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. 'వికేంద్రీకరణను మూడు ముక్కలాట అని ఎగతాళి చేశారు. ఇన్నాళ్లు అమరావతికి చట్టబద్ధత లేదా? మిగతా2లో...

## తెలంగాణ సంపద

# కొల్లగొడుతున్న రేవంత్

- కాంగ్రెస్ ఎన్నికల ఫండ్ కోసం రాష్ట్ర సంపద తరలింపు
- బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ఘాటు విమర్శలు



2లో

## బాసర మాస్టర్ ప్లాన్‌కు

# సిఎం రేవంత్ ఓకే...

- రూ.225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి
- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్మాణాలు
- 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు సిఎం శంకుస్థాపన
- అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించిన రేవంత్ రెడ్డి



2లో

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
05 -04-2026

# అమరావతి నిర్మాణంలో జాప్యం సహించను

(మొదటి పేజీ తరువాయి)

సీఎం చంద్రబాబు ఆజ్ఞాపించారు. ఇసుక, గ్రావెల్ కొరతతో నిర్మాణ పనుల్లో జాప్యం జరగకూడదని సీఎం చంద్రబాబు చెప్పారు. అయితే, కృష్ణాజిల్లా అటవీ శాఖ అధికారుల వల్లే గ్రావెల్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ముఖ్యమంత్రి దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. అటవీ అధికారులతోనే అసలు సమస్య వస్తోందన్నారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా అటవీశాఖ అధికారుల తీరుపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధానికి అవసరమైన ఇసుక, గ్రావెల్ గ్రీన్ ఛానెల్ ద్వారా వెళ్లాలని ఆదేశించారు. మెటీరియల్ సరఫరాలో ఎవరి ఒత్తిళ్లకూ లొంగొద్దని హుకుం జారీ చేశారు. ఎవరైనా ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి అంశాన్నీ వక్రీకరించేలా కొందరు రాజకీయాలు చేస్తున్నారని.. ఇలాంటి పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలి కదా? అంటూ సున్నితంగా హెచ్చరించారు. రగరాని ఘటనలు జరిగితే వెంటనే అలర్ట్ చేయాల్సిన బాధ్యత లేదా? అంటూ కాంట్రాక్ట్ సంస్థలను చంద్రబాబు ప్రశ్నించారు. ప్రభుత్వంపై బురద జల్లేందుకు కొందరు సిద్ధంగా ఉన్నారన్నారు. నిర్మాణ సంస్థలు సమర్థులైన ప్రాజెక్ట్ మేనేజర్లను నియమించుకోవాలన్నారు. అలా చేయకుంటే ఆ ప్రభావం ప్రభుత్వంపై పడుతుందన్నారు సీఎం. ఇలాంటి నిర్లక్ష్యపు ధోరణిని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించమని సీఎం చంద్రబాబు వారికి తేల్చి చెప్పారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ స్థలంలో సుమారు 20 వేల మంది కార్మికులు, నిపుణులు పని చేస్తున్నారు. ప్రతి నిర్మాణ సంస్థ ఎంత మేరకు పనులు పూర్తి చేసింది, టార్గెట్లను ఎంతవరకు సాధించింది అనే విషయాలపై పనుల వారీగా ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. కార్మికుల సంఖ్య, యంత్రాల వినియోగం వంటి అంశాలపై కూడా సమగ్ర చర్చ చేపట్టారు. వారం, నెలవారీ టా÷-గ్గ÷ట్లు నిర్దేశించుకుని పనులు పూర్తి చేయాలని అధికారులు, సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి సూచించారు. వర్షాకాలం ముందు పూర్తి చేయాల్సిన పనులపై అధికారులు తమ లక్ష్యాలను సీఎంకు వివరించారు. రాజధాని నిర్మాణాన్ని కేవలం కాంట్రాక్ట్ వర్క్‌గా చూడొద్దని.. ఇప్పుడు పనులు చేపట్టే వారంతా చరిత్రలో భాగస్వాముల వుతున్నట్టే అని సీఎం చంద్రబాబు తెలిపారు. 'నిర్మాణ సంస్థలుగా మీరు ఎన్నో ప్రాజెక్టులు చేసి ఉంటారు... కానీ రాజధాని నగరాన్ని నిర్మించే అవకాశం అందరికీ దక్కదు. రాజధానిని అద్భుతంగా, వినూత్నంగా నిర్మించేందుకు అపార అవకాశాలున్నాయి. అమరావతిని ఫ్యూచర్ సిటీగా నిర్మించాలనే ప్రభుత్వ ఆలోచనను క్షేత్రస్థాయిలో అమలు చేసి చూపించాల్సింది మీరే. నాణ్యతతో నిర్మాణాలు ఉండాలి... కాస్ట్ ఎఫెక్టివ్ చర్యలు తీసుకోవాలి. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ వంటి వాటిని వినియోగించుకోవాలి. రాజధాని ప్రతిష్ఠను పెంచేలా ఎవరికైనా ఆలోచనలు వస్తే వాటిని ప్రభుత్వంతో పంచుకోవచ్చు. ప్రభుత్వం నిర్దేశిరచిన సమయానికి నిర్మాణం పూర్తి చేసి తీరాల్సిందే. ఈ విషయంలో ఏ మాత్రం రాజీ ఉండదు. మ్యాన్ పవర్ పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతి నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఈ సమీక్షకు మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీ ఉన్నతాధికారులు, రాజధాని నిర్మాణ పనులు చేపట్టిన వివిధ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో వివిధ దశల్లో రూ.57,821 కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయి. హౌసింగ్, రోడ్లు, ట్రంక్ ఇన్‌ఫ్రాస్టక్చర్, ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్‌తో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం వంటి ఐకానిక్ భవనాల నిర్మాణం వేగంగా జరుగు తోంది. వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన, రద్దు చేసిన పనుల సంబంధిత వివాదాలు, సమస్యలను పరిష్కరిం చి సీఆర్డీఏ మళ్లీ పనులను చేపట్టింది. నాటికి నేటికి నిర్మాణ వ్యయం పెరగడం వంటి సవాళ్లను అధిగమించి టెండర్లు పూర్తి చేసి పనులను అప్పగించింది సీఆర్డీఏ.

# ఎఐ వైపు ఐటిరంగం పరుగు

(మొదటి పేజీ తరువాయి)

అవగాహన పెంచేందుకు, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఏపీ ప్రభుత్వం, ఎస్‌టీపీఐ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కెరీర్ పట్ల స్పష్టత, టెక్నాలజీకి అనుగుణంగా స్కిల్స్ పెంచుకోవడంపై దిశానిర్దేశం చేశారు. 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో వస్తున్న మార్పులు, భవిష్యత్ తరాలకు అందించాల్సిన శిక్షణపై వర్క్‌షాప్ నిర్వహించారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు అమరావతి, విజయవాడలో ఈ నాలుగో సదస్సును నిర్వహిస్తున్నాం. గతంలో విశాఖపట్నంలో రెండు సార్లు, కాకినాడలో ఒకసారి ఈ కార్యక్రమాలు జరిగాయి. 25 ఏళ్ల కిందట సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయాల వల్ల ఐటీ రంగంలో తెలుగువారు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. హైదరాబాద్ ఒక మహానగరంగా అభివృద్ధి చెందింది. విశాఖపట్నంలో డేటా సెంటర్లు ఏర్పాటు కాబోతున్నాయి. ఇప్పటికే మూడు గిగావాట్ల డేటా సెంటర్స్ కోసం ఒప్పందాలు జరిగాయి. మరో 3 గిగావాట్లు పైప్‌లైన్‌లో ఉన్నాయి. క్వాంటమ్ కంప్యూటింగ్ ఇనిషియేటివ్‌ను అమరావతిలో ప్రారంభించడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరోస్థాయికి తీసుకెళుంది. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే రూ.13.5 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా.. సుమారు రూ.6.5 లక్షల మందికి ఉపాధి లభించింది. ఉత్తరాంధ్రకి గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి సంస్థలు వచ్చాయి. రాయలసీమలోనూ ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్ రంగాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా నిలబెట్టడమే మా లక్ష్యం' అని చెప్పారు.

# అమరావతి పేరుతో ప్రజలపై భారం

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే రాష్ట్రంపై చంద్రబాబు మోయలేని భారం మోపారు. అమరావతిని పూనకం వచ్చినట్లు రీస్టార్ట్ చేశారు. రాజధానిని పేకముక్కలతో పోల్చి వెటకారాలాడారు. ప్రజలపై భారంలేని గ్రోత్ ఇంజిన్ కావాలన్నది జగన్ ప్రతిపాదన. రాజధాని గురించి తొలుత ఆలోచన చేసినప్పుడు ప్రభుత్వ భూమి 30వేల ఎకరాలు ఉండాలన్నారు. సామాన్యులకు, మధ్యతరగతి ప్రజలకు, రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చేవారికి అందుబాటులో ఉండాలన్నది అప్పుడు ఆయన ఆలోచన. దీనికోసం చేసే ప్రయత్నం ప్రభుత్వం మీద బరువు కాకూడదన్నది జగన్ ఆలోచన. దాన్ని దృష్టిలో పెట్టుకునే 30 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నచోట రాజధాని పెట్టమన్నారు. చంద్రబాబు 2019లో దిగిపోయే నాటికి రాజధాని ప్రాంతంలో దారుణమైన దోపిడీ, అవినీతి జరిగింది' అన్నారు. మా ప్రభుత్వంలో ఆ వ్యవహారాలన్నీ వెలుగులోకి వచ్చాయి. ఏ అవకాశం వచ్చినా దోపిడీ చేయడం అన్నది చంద్రబాబుకు అలవాటు. ఎన్ని విధాల పిండుకుని సంపాదించాలో చంద్రబాబుకు తెలుసు. అవసరంలేని, ఎక్కడాలేని రేట్లు పెట్టి, అందమైన పేర్లతో కాంట్రాక్టులు ఇచ్చి, దోపిడీ చేస్తున్నారు. మోటారు పెట్టి నీటిని తోడినట్టు, ప్రజల సొమ్మును రాజధాని పేరుమీద లాగేస్తున్నారు' అని అన్నారు. ఏపీలో చంద్రబాబు పట్టించుకోని సిటీలు ఎన్నో ఉన్నాయి. పార్లమెంట్ సాక్షిగా రేణుకా చౌదరి కమ్మరావతి అన్నారు. అమరావతిపై కుల ముద్ర వేయబోయారు. రేణుకాచౌదరి వ్యాఖ్యలను టీడీపీ ఎంపీలు ఎందుకు ఖండించలేదు. రేణుకా చౌదరి అన్న మాటలకు నారా లోకేష్ చప్పట్లు కొట్టారు. రాజధాని నిర్మాణ ఖర్చు ప్రజల మీద పడకూడదన్నదే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన. రాజధాని ప్రాంతంలో చంద్రబాబు సొంత ఇల్లు కట్టుకోలేదు. వైఎస్ జగన్ ఇల్లు, పార్టీ కేంద్ర కార్యాలయం ఇక్కడే కట్టుకున్నారు' అని సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. చంద్రబాబు అండ్ కో దోపిడీ కోసమే అమరావతిని వాడుకుంటున్నారని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. 'మేము అమరావతిపై కులముద్ర వేయలేదు. రూ.2 లక్షల కోట్ల అప్పులతో సాధ్యంకాని అమరావతిపై... సంబరాలు చేయాలని ఇతర ప్రాంతాలకు చెప్పడం అన్యాయం. అమరావతి సంబరాల పిలుపును ప్రజలు తిరస్కరించారు. అధికారులకు, ఉద్యోగులకు ఆదేశాలు ఇచ్చినా పట్టించుకోలేదు.మట్టి, నీళ్లు ఇచ్చి నెత్తిమీద చేయిపెట్టారని ప్రధాని మోదీని చంద్రబాబే అన్నారు. అమరావతికి కులం రంగును పులిమింది చంద్రబాబే. అమరావతిలో అవినీతిని మేం ప్రశ్నిస్తున్నాం. నేలమీద నిలబడి ఆలోచించాలని జగన్ సలహా ఇచ్చారు. అది చేయకుండా ఎదురుదాడి చేస్తున్నారు. పార్లమెంటు అధికారాలు, చట్టాల తయారీ మీద చంద్రబాబువి అవగాహనలేని మాటలు. ఇన్నాళ్లు ముఖ్యమంత్రిగా ఆయన ఎలా పనిచేశారో కూడా అర్థం కావడంలేదు' అని చెప్పారు. అమరావతి బాండ్లను తన ఘనతగా చంద్రబాబు చెప్పుకోవడం సిగ్గుచేటని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. 'అప్పట్లో 8 శాతం వడ్డీకి రుణాలు వస్తుంటే, చంద్రబాబు 10.3 శాతం వడ్డీకి తెచ్చారు. దీన్ని కూడా ఘనంగా చెప్పుకోవడానికి సిగ్గుచేటు కాదా? అప్పు భరించేది, చెల్లించాల్సింది ప్రజలే. అమరావతి ప్రజలు కూడా ఈ అప్పులు భారాన్ని మోయాలి. అమరావతి ఇప్పట్లో కాదని చంద్రబాబే చెప్తున్నారు. 2043 అని చెప్తున్నారంటే దాని అర్థం అదే. అప్పటి వరకూ అమరావతి పేరుతో దోపిడీ చేయాలన్నది చంద్రబాబు తన అవినీతిని అందమైన కథల ద్వారా ప్రజలకు కన్వెన్స్ చేయాలనుకుంటున్నారు. తన దోపిడీ, అవినీతి కోసమే అమరావతిని చంద్రబాబుగా రాజధానిగా ఎంపిక చేసుకున్నారు. ఎన్ని కాంట్రాక్టులు అయితే, అంత డబ్బు సంపాదించవచ్చన్నది చంద్రబాబు ఆలోచన. చంద్రబాబు అబద్దాలకు ఆణిముత్యం. చంద్రబాబు చెప్తున్నదానికీ, జగన్ చెప్తున్నదానికీ మధ్య వ్యత్యాసాన్ని, నిజానిజాలపై ప్రజలు ఆలోచన చేయాలి. జగన్ చెప్పిన దాంట్లో వాస్తవికతను కనిపిస్తుంది. చంద్రబాబు ప్రణాళికతో అసలు రాజధాని వస్తుందా?' అని ప్రశ్నిం చారు. ఉద్యోగాలు ఇచ్చే నగరం, సజీవనగరంగా, అప్పుల భారం లేని విధంగా, సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టుగా అమరావతి ఎప్పుడు మారుతుంది? ఈ తరహా నగరం ఇప్పుడు కాదని చంద్రబాబే చెప్తున్నారు. ప్రభుత్వం చేసే అప్పుల ద్వారా రాజధాని కడితే ప్రభుత్వానికి ట్యాక్స్‌లు వస్తాయని అసంబద్ధమైన వాదనలు చేస్తున్నారు. అప్పుల ద్వారా నిర్మాణాలు, పైగా కంపెనీలకు జీఎస్టీ రాయితీలు. రూపాయి ఖర్చు చేసి, 10 పైసలు ఆదాయాన్ని, ఆదాయం అంటారా? అని అన్నారు. ఆ పది పైసలు కూడా కాంట్రాక్టర్లకు రాయితీలకు పోతుంది. అసలు చంద్రబాబు ఏ ఎకనామిక్స్ చదివాడో అర్థం కావడం లేదు. ఇంతచేసి చంద్రబాబు కట్టేది 7 బిల్డింగులు. అమరావతిలో 99 పైసలకు ఎందుకు భూములు ఇవ్వడంలేదు? అమరా వతిలో ప్రభుత్వానికి వచ్చే భూములు ఎప్పుడు అమ్ము తారు? హైదరాబాద్‌లో ఉన్నంత రేటు రావడానికి ఎంత సమయం పడుతుంది? చంద్రబాబువి ప్రజలను మోసం చేసే మాటలే' అని అన్నారు.

# బాసర మాస్టర్ ప్లాన్‌కు సిఎం రేవంత్ ఓకే

**హైదరాబాద్,మన జనప్రగతి ఏప్రిల్ 04:** బాసర ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 6న బాసర సరస్వతి ఆలయం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సుమారు రూ.225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించి సమగ్ర మాస్టర్ ప్లాన్ ఇప్పటికే సిద్ధం కాగా, ఆలయాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రహదారులు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆలయ పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఈవీ వాహనాలనే అనుమతించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని స్పష్టం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఆలయ పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నియంత్రణలు ఉండాలని సీఎం పేర్కొన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూ, ఆలయాన్ని అభివృద్ధి చేసే దిశగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశంచేశారు. బాసర ఆలయ అభివృద్ధిపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు అధికారులు వివరించారు. మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం. ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి ఉండాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను, రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఈవీ వాహనాలను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం చేయాలని ఆదేశించారు. తిరుమల తరహాలో అన్ని ఆలయాల పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నిబంధనలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశానికి మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదు

(మొదటి పేజీ తరువాయి)

బలమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. కేరళలో అతిపెద్ద మార్పు రాబోతోంది. తొలిసారి బీజేపీ-ఎన్డీయే ప్రభుత్వం కేరళలో అధికారంలోకి రాబోతోంది' అని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఎల్డీఎఫ్-యూడీఎఫ్ ప్రభుత్వాలు ఎప్పుడూ ఈ ప్రాంతం గురించి పట్టించుకోలేదని, రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, చాలా ఏళ్లుగా ఒక్క ప్రధాన బ్రిడ్జి కూడా నిర్మించ లేదని, మెడికల్ కాలేజీ పరిస్థితి దయనీయంగా ఉందని విమర్శించారు. కనీస మౌలిక సదుపాయాలు లేకుండా జీవన ప్రమాణాలు ఏ స్థాయిలో ఉంటాయనేది ఎవరైనా ఊహించవచ్చని అన్నారు. ఎన్డీయే విధానాలతో ప్రతి ఒక్క వర్గానికి, ముఖ్యంగా మహిళలు ఎంతో లబ్ధి పొందుతున్నారని ప్రధాని అన్నారు. వలస కార్మికులకు ఉద్యోగాలు కల్పన కేరళలో అతిపెద్ద సమస్యగా ఉందని, బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని సమస్యలను పరిష్కరిస్తామని, ఇది మోదీ ఇచ్చే హామీ అని ప్రధాని భరోసా ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాలు, గోవా తరహాలోనే కేరళను అభివృద్ధి చేస్తామని అన్నారు. శబరి రైల్వే ప్రాజెక్టు నిలిచిపోవడానికి ఎల్‌డీఎఫ్ కారణమని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని అడ్డంకులూ తొలగిపోతాయని భరోసా ఇచ్చారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఈశాన్య రాష్ట్రాల్లో మాదిరిగా అభివృద్ధి ప్రాజెక్టులు చేపడతామన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డ ఆయన.. పశ్చిమాసియా అంశంపై భయాన్ని సృష్టించే వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. కేరళలో శబరిమల రైల్వే ప్రాజెక్టు కొత్త అవకాశాలను తీసుకురాగలదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇది శబరిమలకు ప్రత్యక్ష అనుసంధానాన్ని మెరుగుపరుస్తుందని.. స్థానిక వ్యాపారాలకు కొత్త ఊపునిస్తుందని చెప్పారు. యువతకు కొత్త ఉపాధి మార్గాలను తెరుస్తుందని వివరించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అసంపూర్తిగా వదిలేసిందని విమర్శించారు. భాజపా డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇలాంటి అడ్డంకులన్నీ తొలగిపోతాయన్నారు.కాగా, కేరళ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న ఒకే విడతలో జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# గడవు ముగుస్తోంది...

(మొదటి పేజీ తరువాయి)

విధ్వంసానికి 48 గంటల సమయమే ఉందన్నారు. అంతా భగవంతుడి దయ! అంటూ ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. మరోవైపు అమెరికాకు చెందిన ఎఫ్-15 యుద్ధవిమానాన్ని ఇరాన్ కూల్చివేసిన విషయం తెలిసిందే. అయితే ఇందుకోసం అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలను ఉపయోగించినట్లు ఇరాన్ వెల్లడించింది.గగనతలంపై పూర్తి నియంత్రణ ఉందని ఇరాన్ సైన్యం పేర్కొంది.

# 28 జిల్లాలతో కొత్తగా ఎపి మ్యాప్ విడుదల


**అమరావతి,మన జనప్రగతి ఏప్రిల్ 04:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా రాష్ట్ర నూతన మ్యాప్‌ను విపత్తు నిర్వహణ శాఖ విడుదల చేసింది. మొత్తం 28 జిల్లాలతో కూడిన ఈ అధికారిక మ్యాప్‌ను ఈ నెల 2వ తేదీన ప్రచురించారు. ఇందులో అత్యంత కీలకమైన అంశం ఏంటంటే.. రాజధాని అమరావతి ప్రస్తావన, కొత్తగా ఏర్పడిన జిల్లాల సరిహద్దులను స్పష్టంగా పొందుపరిచారు. ఈ నూతన మ్యాప్‌లో రాజధాని అమరావతిని ప్రత్యేకంగా హైలెట్ చేశారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల సరిహద్దుల మధ్యలో అమరావతిని 'రాష్ట్ర రాజధాని'గా చూపుతూ మ్యాప్‌ను రూపొందించారు. అయితే అమరావతికి ప్రత్యేక బౌండరీల ను కేటాయించకుండానే, ఆ ప్రాంతాన్ని రాజధానిగా గుర్తించడం గమనార్హం. ఈ నూతన మ్యాప్‌లో రాజధాని అమరావతిని ప్రత్యేకంగా హైలైట్ చేశారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల సరిహద్దుల మధ్యలో అమరావతిని.. రాష్ట్ర రాజధానిగా చూపుతూ మ్యాప్‌ను రూపొందించారు. ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేసేందుకు.. గతంలో ఉన్న 26 జిల్లాలకు అదనంగా.. ఇటీవల మార్కాపురం, పోలవరం అనే రెండు కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ రెండు జిల్లాల సరిహద్దులను కూడా తాజా మ్యాప్‌లో తెలియజేశారు. దీంతో ఏపీలో మొత్తం జిల్లాల సంఖ్య 28కి చేరింది. రాష్ట్ర విపత్తు నిర్వాహణ శాఖ ఈ మ్యాప్‌ను విడుదల చేయడం వెనుక ప్రధాన ఉద్దేశం.. ప్రకృతి వైపరిత్యాలు సంభవించినప్పుడు లేదా అత్యవసర పరిస్థితుల్లో జిల్లాల వారీగా సహాయక చర్యలు చేపట్టడానికి స్పష్టమైన భౌగోళిక సమాచారం ఉండటమే. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత సరిహద్దుల విషయంలో ఉన్న సందిగ్ధతను ఈ మ్యాప్ తొలగించనుంది.

# మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. వేసవి సెలవులు కావడంతో.. ఫంక్షన్ అనంతరం రేష్మా దర్గుడే మేరకోడళ్లు మాధురి, శ్రావణి.. అశా దర్గుడే మేన కోడలు సమృద్ధి కూడా వారితో ఇండోర్ గ్రామానికి బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో డిండోరీ తాలూకా కేంద్రంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఓ బావిలోకి దూసుకెళ్లింది. అది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్స్ సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ సాయంతో కారును బయటికి తీశారు. ఆ కారులో 8 మృతదేహాలు ఉన్నాయి. కారు నుంచి బయటపడిన మరో బాలిక మృతదేహాన్ని గజ ఈతగాళ్లు వెతికి వెలికి తీశారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికిగల కారణాలపౌ ఆరా తీస్తున్నట్లు తెలిపారు. ప్రమాద సమయంలో సునీల్ దత్తాత్రేయ దర్గుడే కారు నడుపుతున్నట్లు తమ ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. కాగా ఈ ప్రమాదంలో మరణించిన ఆరుగురు పిల్లలు 7 నుంచి 14 ఏళ్ల మధ్య వయసు వారేని తెలిపారు. ఆ ఆరుగురిలో ఒకరు బాలుడు, ఐదుగురు బాలికలు ఉన్నట్లు చెప్పారు.

# తెలంగాణ సంపద కొల్లగొడుతున్న రేవంత్



**వరంగల్,మన జనప్రగతి ఏప్రిల్ 04:** తెలంగాణ ప్రజల సంపదను రేవంత్ రెడ్డి కొల్లగొడుతున్నారని ఈటల రాజేందర్ ఆరోపణలు గుప్పించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల కోసం రాష్ట్ర ప్రజల సంపదను తరలిస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆరు గ్యారెంటీలు, ఫీజురీయింబర్స్‌మెంట్ సహా పలు అంశాలపై సీఎంకు ప్రశ్నలు సంధించారు. తెలంగాణ ఎన్నికల వేళ ఆరు గ్యారంటీలు- 66 హామీల పేరుతో ప్రజలను ఆయన మోసం చేశారని ఎంపీ ఈటల ఆగ్రహించారు. రాష్ట్ర ప్రజానీకం గంపెడు ఆశలతో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెడితే.. చట్ట సభల్లో ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వ్యక్తిగత దూషణలతో కాలం వృథా చేశారని మండిపడ్డారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2023 నుంచి ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో రూ.600 కోట్లు మాత్రమే విడుదల చేసిందని ధ్వజమెత్తారు. పేద విద్యార్థుల జీవితాలతో రేవంత్ రెడ్డి సర్కార్ చెలగాటం ఆడుతోందని ఆగ్రహించారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల అమలు ఎలా సాధ్యమవుతుందని ఎన్నికల వేళ అగినప్పుడు.. తాను చేసి చూపిస్తానని రేవంత్ ప్రగల్భాలు పలికారని చెప్పారు. ఇప్పుడు హామీలు అమలు చేయకుండానే చేసినట్లు చెప్పుకుంటున్నారని విమర్శించారు. వేల కోట్ల విలువ చేసే భూములను ప్రైవేట్ వ్యక్తులతో కలిసి సీఎం రేవంత్ అమ్ముకుంటున్నారంటూ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన ఆరోపణలు చేశారు.

# పత్తికొండ, మద్దికెర మండలాల సర్పంచులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు



**పత్తికొండ మన జనప్రగతి ఏప్రిల్ 04:-** ఐదు సంవత్సరాలపాటు పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తూ, గ్రామ స్థాయిలో ప్రజలతో మమేకమై పనిచేసిన సర్పంచులు నిజమైన పార్టీ బలంగా నిలిచారు అని తెలియజేశారు. గ్రామాభివృద్ధి నుండి సంక్షేమ కార్యక్రమాల అమలు వరకు ప్రతి అంశంలోనూ వారు నిబద్ధతతో ముందుండి పనిచేసి పార్టీకి మంచి పేరు తీసుకొచ్చారని, సమస్యలు ఎదురైనప్పటికీ వెనుకడుగు వేయకుండా, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం లో సర్పంచులు కీలక పాత్ర పోషించారు. ప్రజల నమ్మకాన్ని గెలుచుకుని,పార్టీపై విశ్వాసాన్ని మరింత బలపరిచిన వారి సేవలు ఎప్పటికీ మరువలేనివి అని,పార్టీ కోసం తమ సమయం, శ్రమ అంకితం చేస్తూ కష్టపడుతున్న ప్రతి సర్పంచ్ పార్టీకి ఒక బలమైన స్తంభంలాంటివా యురు. వారి కృషి, నిబద్ధత, సేవలను పార్టీ ఎల్లప్పుడూ గౌరవిస్తూ గుర్తుంచుకుంటుందని తెలియజేశారు.

# చేనేతలకు 200, పవర్‌లూమ్ కార్మికులకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్

## కొండమాచుపల్లెలో అవగాహన సదస్సు



**ఒంటిమిట్ట మన జనప్రగతి ఏప్రిల్ 04:-** చేనేత కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. చేనేత కార్మికులకు 200 యూనిట్లు, పవర్ లూమ్ కార్మికులకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో, ఈ పథకంపై అవగాహన కల్పించేందుకు ఒంటిమిట్ట మండలం కొండమాచుపల్లెలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజంపేట నియోజకవర్గ ఇంచార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన చేనేత కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ ఉచిత విద్యుత్ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ పథకం ద్వారా వేలాది కార్మికులపై విద్యుత్ భారము తగ్గి, వారి జీవనోపాధి మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వం తీసుకున్న ఈ సాహసోపేత నిర్ణయం పట్ల స్థానిక చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. తమ కష్టాలను గుర్తించి ఉచిత విద్యుత్ ప్రకటించినందుకు కూటమి ప్రభుత్వానికి మరియు ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్ పి టి సి ముద్దు క్రిష్ణా రెడ్డి, మామిళ్ళ శ్రీహరి, ఆలూరు వెంకటసుబ్బయ్య, సాధు శ్రీను, సామా శ్రీనివాసులు, బొడిచెర్ల శ్రీనివాసులు, చేనేత నాయకులు, కార్మికులు , తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజలలో ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించేలా గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహించాలి




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఏప్రిల్ 04:-** ప్రజలలో ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించేలా గ్రామాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చెయ్యాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి అన్నారు.శనివారం జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవా సదన్ లో కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కామేశ్వర ప్రసాద్ తో ప్రజలలో ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించేలా గ్రామాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఏప్రిల్ 7వ తేదీ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కర్నూల్ లో గల విలేజ్ అర్బన్ సెంటర్లలో ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే కీలక సమస్యలపై ప్రచారం చేయాలని కోరారు. అలాగే ప్రజల్లో ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంపొందించే చర్యలు చేపట్టాలని కోరారు. వైద్య సదుపాయం అందుబాటులో లేని గ్రామాలలో మెడికల్ క్యాంపులను నిర్వహించి ప్రజలకు వైద్య పరీక్షలు చేసేలా కృషి చేయాలని తెలిపారు. ఈ సదస్సులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కామేశ్వర ప్రసాద్ మరియు ఇతర డాక్టర్లు పాల్గొన్నారు.

# రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఏప్రిల్ 04:-** ప్రతి శనివారం రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్, కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సంధర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీసుస్టేషన్ పరిధులలో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత , ట్రాఫిక్ నిబంధనల పై సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బైక్ లు నడిపే వారు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా , ఓవర్ స్పీడ్ , ఓవర్ లోడ్ తో వాహనాలు వెళ్ళకుండా, డ్రంకెన్ డ్రైవ్ చేయరాదని తదితర రోడ్డు భద్రత ప్రాముఖ్యతల పై ప్రజలకు అవగాహన కల్పించారు. 2026 జనవరి 1 నుండి ఏప్రిల్ 3 వరకు ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై ఈ - చలనాలు నమోదు చేశారని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.ఓవర్ స్పీడ్ చేసిన 2,299 మంది పై ,హెల్మెట్ లేకుండా వాహనం నడిపిన 2,072 మంది పై , సెల్ ఫోన్ డ్రైవింగ్ చేసిన 567 మంది పై ఈ - చలాన్ జరిమానాలు నమోదు చేశారు. 2,236 డ్రంకెన్ డ్రైవింగ్ కేసులు, 4,318 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశారని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.

# అమరావతి రాజధానితో పాటు రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

## రాయలసీమ ప్రాంతాన్ని విస్మరించిన ప్రభుత్వం

**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఏప్రిల్ 04:-** రాష్ట్రానికి అమరావతి రాజధానితో పాటు రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయాలని జిల్లా కాంగ్రెస్ ఓబీసీ సెల్ చైర్మన్ డివి సాంబశివుడు కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు బి. క్రాంతి నాయుడు ఆధ్వర్యంలో సాంబశివుడు అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మన రాష్ట్రము లో సుమారుగా 11 లక్షల కోట్ల అప్పు అయింది. మన దేశం లో 150 లక్షల కోట్ల అప్పు అయింది 50 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ పాలన చేస్తే కేవలం 50 లక్షల కోట్లు అపుచ్చేసింది. ఇప్పుడు బిజెపి ప్రభుత్వం 150 లక్షల కోట్ల అప్పు చేసింది. మా కాంగ్రెస్ పార్టీ హయాంలో ప్రాజెక్టులు కట్టాము, రైల్వే జోన్లు ఇచ్చాము. ఎయిర్పోర్టులు నిర్మించాము యల్ ఐ సి ఆఫీస్ లను నిర్మించాము హాస్పిటల్ లు నిర్మించాము ప్రతి ఒక్క విషయంలో కాంగ్రెస్ పార్టీ ముందు ఉంది ఇప్పుడు ఉన్న పార్టీలు ఏమి చేయలేదు 12 సంవత్సరాలు బిజెపి ప్రభుత్వం వచ్చింది ఏమి చేసింది నరేంద్ర మోదీ 2014 లో గెలిచాడు కానీ నోట్ల రద్దు అని చెప్పాడు మన దేశము ఆర్థికంగా క్రుంగ దీశాడు. రెండు వేల నోట్లు రద్దుతో బిద ప్రజలే ఉన్నారు. కానీ యే నాయకుడు కానీ యే అధికారులు కానీ బ్యాంక్ ల దగ్గర నిలబడలేదు. బ్యాంక్ ల చుట్టు తిరిగి తిరిగి బిద




ప్రజలు అలసి పోయారు. బిజెపి నాయకులను చంద్రబాబు నాయుడు తిట్టాడు ఒకప్పుడు, జగన్ మోదీ ని తిట్టాడు వీరు అందరు కలిసి మన దేశాన్ని, రాష్ట్రాన్ని సర్వ నాశనం చేస్తున్నారు. ఆంధ్ర రాష్ట్రానికి పోలవరం ప్రాజెక్టు తెస్తాము అన్ని చెప్పారు ఇంతవరకు పోలవరం ప్రాజెక్టు పూర్తి కాలేదు. పోలవరం ప్రాజెక్ట్ వస్తే మా ఆంధ్ర రాష్ట్రము అభివృధి బాటలో పొలాలు సస్య శ్యామలం అవుతాయి. పోలవరం పాజెక్ట్ తెచ్చారా ఇంత వరకు తేలేదు. చంద్రబాబు నాయుడు వెదవతి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి ఇంతవరకు పట్టించుకోలేదు. ఆర్డీయస్ కాలువ కట్టించి కోడుమూరు నియోజకవర్గం గుండ్రేవుల ప్రాజెక్టు డ్యామ్ తీసుకోని డ్యామ్ నిర్మించి పొలాలకు నీరు ఇస్తామన్నారు ఇప్పటి వరకు ఇవ్వలేదు. అనంతరం డిసిసి అధ్యక్షులు బి. క్రాంతి నాయుడు మాట్లాడుతూ నేడు రాష్ట్రమంతా కూడా అమరావతి సంబరాలు చూస్తా ఉన్నాము. కాంగ్రెస్ పార్టీ కూడా అమరావతి రాజధాని కి మద్దతు పలికింది తెలుపుతూనే కొన్ని కీలకమైన అంశాలను మా రాష్ట ఇంచార్జ్ మాణిక్యం ఠాగూర్ గారు లేవనెత్తడం జరిగింది. కానీ అవి మాత్రం రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు విస్మరించారు. ఈ రాష్ట్రానికి 2014 లో పునర్విభజన చట్టం తెచ్చినప్పుడు విభజన చట్టంలోని ప్రత్యేక హోదా ఈ రాష్ట్రానికి అవసరం అని ఆరోజు చెప్పడం జరిగింది. ఒక్క ప్రాంతం అందరికి కూడా అనుకూలముగా ఉండే ఒక ప్రాంతాన్ని రాజధానిగా ఎన్నో అంశాలను ప్రశ్నవిస్తూ కాంగ్రెస్ పార్టీ పునర్విభజన చేపట్టడం జరిగింది. రాష్ట్ర పునర్విభజన ఒక్క కాంగ్రెస్ పార్టీ పైనే దొబ్బుతున్నారని కానీ ఆరోజు అన్ని పార్టీలు లెటర్లు ఇచ్చాయని. నేటికీ బూచిగా చూపిస్తావుంటే రాష్ట్ర విభజన అనేది కాంగ్రెస్ పార్టీ ఒక్కటే కాదు అన్ని పార్టీల లెటర్లతోనే ఆరోజు విభజన జరిగిందని ఈరోజు మీరు అందరు చూడొచ్చు ఆరోజు మద్దతు తెలిపితేనే కాంగ్రెస్ పార్టీ ప్రజల యొక్క విశ్వాసనీయతను మనమందరం గౌరవించాల ప్రజలు కోరుకుంటున్నపుడు ప్రజల కోసం మనము ఇవ్వాలి అని ఆరోజు మేనిఫెస్టోలో తెలంగాణ ఇచ్చాము కాబట్టి ఆరోజు చేయడం జరిగిందని క్రాంతి నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, డిసిసి మాజీ ప్రధాన కార్యదర్శులు రియాజుద్దీన్, చిన్న నరసింహులు, మార్కెట్ యార్డ్ మాజీ ఉపాధ్యక్షులు కే రాఘవేంద్ర రెడ్డి మొదలగువారు పాల్గొన్నారు.

# దేవదాయ శాఖ ఈఈ కాకర్ల గంగయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా ఆత్మీయ సత్కారం

**పులివెందుల మన జనప్రగతి ఏప్రిల్ 04:-** పులివెందుల లోని శ్రీకృష్ణ ఆలయంలో దేవదాయ శాఖ ఈఈ కాకర్ల గంగయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా ఆత్మీయ సత్కారం కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సత్కార సమావేశంలో కాకర్ల గంగయ్య సుదీర్ఘ సేవను గుర్తు చేసుకుని సహోద్యోగులు, స్నేహితులు, బంధువులు అభినందనలు తెలిపారు. దేవదాయ శాఖలో ఈఈ గా బాధ్యతలు నిర్వహించిన గంగయ్య సేవలను ప్రశంసించారు కాకర్ల గంగయ్య విధులు నిర్వహించే సమయంలో అనేక దేవాలయాల అభివృద్ధి కొరకు ఎంతో కృషి చేశారన్నారు మొదట వివిధ ప్రాంతాలలో పనిచేసిన కాకర్ల గంగయ్య కడప జిల్లాకు రావడం జరిగిందని కడప జిల్లాకు వచ్చిన తర్వాత సుమారు 600 గుళ్ళకు పైగా పునర్నిర్మాణ



కార్యక్రమంలో తన వంతు కీలక పాత్ర పోషించా రన్నారు ఈ ప్రాంతంలో ఆలయాల అభివృద్ధి మరియు నిర్మాణ కార్యక్రమాలను గురించి మాట్లాడితే మొదటగా వచ్చే పేరు కాకర్ల గంగయ్య అని వక్తలు చర్చించారు అదేవిధంగా కొంతమంది వక్తలు మాట్లాడుతూ ఆలయంలో జరిగిన పాల్గొన్న వారు గంగయ్య కి పుష్పగుచ్చాలు సన్మానించారు అందించి,



సన్మానించారు.ఉద్యోగ విరమణ తర్వాత కూడా కాకర్ల గంగయ్య సమాజ సేవలో కొనసాగాలని అందరూ కోరుకున్నారు. ఈ సందర్భంగా కాకర్ల గంగయ్య తన అనుభవాలను పంచుకుని, అందరికీ ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగి, అందరినీ ఆకట్టుకుంది.

# అంగన్వాడీల్లో అక్రమాలను సహించేది లేదు

## పులివెందుల అంగన్వాడీ కేంద్రాల్లో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఆకస్మిక తనిఖీ

**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఏప్రిల్ 04:-** పట్టణంలోని పలు అంగన్వాడీ కేంద్రాలను శనివారం శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇస్లామపురం 1 & 2 కేంద్రాలతో పాటు జెండామాను వీధిలోని అంగన్వాడీ కేంద్రాలను ఆయన సందర్శించి, అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు.కేంద్రానికి వస్తున్న పిల్లల సంఖ్యకు, హాజరు పట్టికలో నమోదైన వివరాలకు పొంతన ఉందో లేదో ఎమ్మెల్సీ స్వయంగా తనిఖీ చేశారు. గర్భిణీలు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారంపై లబ్ధిదారులతో మాట్లాడారు.అంగన్వాడీ



కేంద్రాల్లో నిల్వ ఉంచిన కోడిగుడ్లను ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన పరిమాణం కంటే కోడిగుడ్లు చాలా చిన్నవిగా ఉండటంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "చిన్నారులకు, గర్భిణీలకు అందించే ఆహారం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు" అని అధికారులను హెచ్చరించారు.కొన్ని కేంద్రాల్లో పారిశుధ్యం సరిగా లేకపోవడం, నిల్వ ఉంచిన సరుకుల నాణ్యత లోపించడంపై సిబ్బందిని ప్రశ్నించారు. అనంతరం ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ "అంగన్వాడీ కేంద్రాలు పేద ప్రజల పిల్లలకు ఆసరాగా ఉండాలి. కానీ ఇక్కడ జరుగుతున్న తీరు చూస్తుంటే పౌష్టికాహార పథకం పక్కదారి పడుతున్నట్లు కనిపిస్తోంది. చిన్నపాటి కోడిగుడ్ల సరఫరాపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి విచారణ జరపాలి. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పులివెందుల మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తుగూట్ల రాఘవరెడ్డి , తాళ్ళపల్లి వెంకటేశ్వర రెడ్డి , జ్ఞానేశ్వర్ నాయుడు శ్రీనివాసులు రెడ్డి ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శారధా స్కూల్ వార్షికోత్సవం కళా ప్రదర్శనల కేరింతలు

## కూచిపూడి, శివాజీ నృత్యాలతో ఆకట్టుకున్న చిన్నారులు

## విద్యతో పాటు సంస్కృతి శారధా స్కూల్ ప్రత్యేకత

## చిన్నారుల ప్రదర్శనలకు నాయకుల ప్రశంసలు

**పటాన్ చెరువు మన జనప్రగతి ఏప్రిల్ 04:-** ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ బాలాజీ కన్వెన్షన్ హాల్‌లో శారధా స్కూల్ ఆధ్వర్యంలో వార్షికోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ప్రతిభను ప్రతిబింబిస్తూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, నాటికలు ప్రదర్శించి హాజరైన అతిథులను ఆకట్టుకున్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ జడ్పిటిసి గడిలా శ్రీకాంత్ గౌడ్, 18వ వార్డ్ కౌన్సిలర్ రాఘవేంద్ర విద్యార్థులను అభినందిస్తూ, చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ముందుండాలని సూచించారు. అలాగే ఇస్నాపూర్ మాజీ ఎంపీటీసీ కాంగ్రెస్ నాయకుడు గడ్డం శ్రీశైలం, 15వ వార్డ్ కౌన్సిలర్ నారాయణదాస్, 16వ వార్డ్ కౌన్సిలర్ కూడా




కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ వేడుకల్లో విద్యార్థులు కూచిపూడి నృత్యం, శివాజీ నృత్య ప్రదర్శనలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారుల ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. పాఠశాల ప్రాంగణాన్ని ఆకర్షణీయంగా అలంకరించి ప్రత్యేక వేదికను ఏర్పాటు చేయడంతో వేడుకలకు మరింత శోభ చేకూరింది.విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఇటువంటి కార్యక్రమాలు పిల్లల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
05 -04-2026

# రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నంద్యాల



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఏప్రిల్ 04:–** ప్రొద్దుటూరు పట్టణం రామేశ్వరం మోరిల దగ్గర నుంచి జరిగే క్రిస్టియన్స్ ఐక్య వేదిక ఏర్పాటు చేసిన "రన్ ఫర్ జీసస్" కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, ఏ ఎస్ పి విభూకృష్ణ.ఈ కార్యక్రమంలో తెదేపా కడప పార్లమెంట్ కార్యదర్శి తలారి పుల్లయ్య,భూమిరెడ్డి సూర్యప్రతాప్ రెడ్డి,తలారి రమేష్,మాజీ కో–ఆప్షన్ సభ్యులు బోనం గురివి రెడ్డి,డేవిడ్,బాలయ్య,పాస్టర్లు,క్రైస్తవ మత పెద్దలు పాల్గొన్నారు.

# నిరసన మధ్య సంబరాలు చేసిన చేనేత కార్మికులు



**సిద్దవటం మన జనప్రగతి ఏప్రిల్ 04:–**యస్.కె.ఆర్ నగర్‌లోని చేనేత క్లస్టర్ భవనాన్ని లీజు పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడంతో స్థానిక కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్మికుల కోసం నిర్మించిన భవనంలో కార్యక్రమాలకు అనుమతి ఇవ్వకపోవడంతో గేట్లు మూసివేయడం వివాదానికి దారితీసింది.అయితే ప్రభుత్వం ప్రకటించిన ఉచిత విద్యుత్ పథకానికి ఆనందం వ్యక్తం చేస్తూ కార్మికులు క్లస్టర్ బయటే కేక్ కట్ చేసి సీఎం కు ధన్యవాదాలు తెలిపారు.క్లస్టర్ భవనాన్ని పూర్తిగా కార్మికుల ప్రయోజనాలకు వినియోగించాలంటూ సోమ వారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

# వివాహ వేడుకల్లో పాల్గొన్న రాజంపేట జనసేన పార్టీ ఇన్చార్జి యలటూరి శ్రీనివాస్ రాజు



**రాజంపేట మన జనప్రగతి ఏప్రిల్ 04:–** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు,జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీ ఠాగూర్ అజయ్ వర్మ , శ్రీమతి పద్మావతి గార్ల కుమార్తె వివాహ వేడుకలో రాజంపేట జనసేన పార్టీ ఇన్చార్జి వెల్లటూరి శ్రీనివాస్ రాజు పాల్గొన్నారు. ఈ వివాహ శుభకార్యంలోపాల్గొని వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి & ఏపీ ఎం ఎస్ ఎం ఈ డెవలప్మెంట్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు , ప్రజాప్రతినిధులు, రాష్ట్ర నాయకులు, వ్యాపారవేత్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# బాలికల పాఠశాలలో కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ



**వేంపల్లె మన జనప్రగతి ఏప్రిల్ 04:–** ఆంధ్రప్రదేశ్ కు శాశ్వత రాజధానిగా అమరావతి ని చేసినందుకు గాను స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత బాలికల పాఠశాలలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతి ప్రాంతాన్ని పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదం పొందినందుకు రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసినట్లు ప్లస్ అసిస్టెంట్ చేరుకూరి శ్రీనువాసులు తెలిపారు. అలాగే విద్యార్థులు అందరూ జై అమరావతి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగాంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పంచాయతీలకు ప్రత్యేక అధికారులు



**లింగాల మన జనప్రగతి ఏప్రిల్ 04:–** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీలకు ఎన్నికైన సర్పంచుల పదవీకాలం ఈ నెల 3 తేదీ కి ముగిసింది. దీంతో లింగాల మండల పరిధిలోని గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.కోమన్నూతల, పార్నపల్లి గ్రామపంచాయతీలకు ఇంఛార్జి అధికారిగా ఎంపీడీవో శ్రీనివాసులు రెడ్డి.లింగాల, కామసముద్రం పంచాయతీలకు తహసిల్దార్ రామచంద్రుడు. మురారిచింతల, ఇప్పట్ల, బోనాల పంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీవో వెంకట్రాముడు. అంబకపల్లి, వెలిదండ్ల పంచాయతీలకు జిఎస్ డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎంపీడీవో ను నియమించారు. కానీ ఆ పోస్టు ఖాళీగా ఉండడంతో ఈ రెండు గ్రామాల ఇంఛార్జి అధికారిగా డిప్యూటీ ఎంపీడీవో వెంకట్రాముడును నియమించారు. పెద్దకుడాల, గుణకనపల్లె,తాతిరెడ్డిపల్లి పంచాయతీలకు మండల ఎంఈఓ1 ప్రసాద్ రెడ్డి, దొండ్లవాగు, లోపట్నూతల, అక్కులుగారిపల్లె పంచాయతీలకు ఎంఈఓ 2 రామకృష్ణయ్య. అంకేవానిపల్లె, రామట్లపల్లి పంచాయతీలకు మండల వ్యవసాయాధికారి రమేష్. చిన్న కుడాల, కర్ణపాపాయిపల్లె పంచాయతీలకు పశు వైద్యాధికారి మంగేష్ లను నియమించినట్లు ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

# ఒంటిమిట్ట కోదండరామాలయంలో వైభవంగా చక్రస్నాన ఘట్టం

- ధ్వజావరోహణంతో ముగియనున్న బ్రహ్మోత్సవాలు





**ఒంటిమిట్ట మన జనప్రగతి ఏప్రిల్ 04:–** కడప జిల్లాలోని చారిత్రాత్మక ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం అత్యంత వేడుకగా ముగింపు దశకు చేరుకున్నాయి. తొమ్మిది రోజుల పాటు కన్నులపండువగా సాగిన ఈ ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆలయ ప్రాంగణంలో చక్రస్నానం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 10:30 గంటల నుండి 11:15 గంటల మధ్య మిథున లగ్నంలో శ్రీదేవి, భూదేవి సమేత కోదండరామస్వామి వారితో పాటు సుదర్శన చక్రత్తాళ్వార్‌కు పవిత్ర జలాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల నడుమ సాగిన ఈ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. చక్రస్నానం అనంతరం భక్తులు భక్తిశ్రద్ధలతో పుణ్యస్నానాలు ఆచరించారు. రాత్రి 7 గంటలకు ఆలయంలో ధ్వజావరోహణం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల ప్రారంభంలో ఆహ్వానించిన దేవతలను తిరిగి సాగనంపే ప్రక్రియగా ఈ కార్యక్రమాన్ని చేపడతారు. దీనితో వార్షిక బ్రహ్మోత్సవాలు అధికారికంగా ముగియనున్నాయి. మార్చి 26న అంకురార్పణతో మొదలైన ఈ ఉత్సవాల్లో సీతారాముల కల్యాణం, గరుడ సేవ, రథోత్సవం వంటివి ప్రధాన ఆకర్షణలుగా నిలిచాయి. బ్రహ్మోత్సవాలు ముగిసిన మరుసటి రోజు, అంటే ఆదివారం సాయంత్రం 6 నుండి రాత్రి 9 గంటల వరకు ఆలయంలో పుష్పయాగం నిర్వహించనున్నారు. ఉత్సవాల సమయంలో తెలిసీ తెలియక జరిగే లోపాలను నివారించేందుకు ఈ విశేష పూజను నిర్వహిస్తారని అర్చకులు తెలిపారు.

# పీహెచ్సీలో పారిశుద్ధ్య నిర్వహణ, వైద్య సేవలను మెరుగుపరచాలి

- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ • గాలివీడు పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ • పీహెచ్సీలో సేవల లోపాలు • సిబ్బంది నిర్లక్ష్యంపై చర్యలకు ఆదేశాలు



**రాయచోటి మన జనప్రగతి ఏప్రిల్ 04:–** గాలివీడు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, వైద్య సేవల పనితీరు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు.తనిఖీ సమయంలో సిబ్బంది హాజరు పట్టిక సక్రమంగా నిర్వహించకపోవడం, పలువురు సిబ్బంది గైర్హాజరు ఉన్నట్లు గమనించిన కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రసూతి గది (లేబర్ రూమ్) పరిశీలనలో అత్యవసర మందులు అయిన మెగ్నీషియం సల్ఫేట్, డెక్స్ట్రోస్, అట్రోపిన్,ఆక్సిటోసిన్ మందులు మరియు జంటామైసిన్, డైజోఫాం, మెట్రోనిడజోల్ ఇంజక్షన్లు సక్రమంగా నిల్వ చేయకపోవడం, లేబర్ రూమ్ ప్రోటోకాల్‌కు అనుగుణంగా అత్యవసర ఔషధాల ట్రే మరియు ఇతర ట్రేలను సక్రమంగా నిర్వహించకపోవడంతోపాటు డ్రగ్ స్టోర్‌లో మందుల నిర్వహణలో లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఔషధాల స్టాక్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించకపోవడంపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా ఆసుపత్రి పరిసరాలు, లేబర్ రూమ్, జనరల్ వార్డు, మరుగుదొడ్లలో పరిశుభ్రత లోపంపై కలెక్టర్ తీవ్రంగా స్పందించారు. రోగులకు అవసరమైన ప్రాథమిక సదుపాయాలను తక్షణమే మెరుగుపరచాలని, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు గ్రామీణ ప్రజలకు కీలక వైద్య సేవలను అందించే కేంద్రాలుగా ఉంటాయని, అక్కడి సేవలు నాణ్యంగా ఉండేలా సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు సమయానికి, నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ తెలిపారు.ఈ తనిఖీలో తహసీల్దార్, సీఐ, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చిరస్మరణీయుడు 'సి.కె.సంపత్ కుమార్': ఆచార్య పి.పద్మ

- బాధ్య కులసచివులు, యోగి వేమన విశ్వవిద్యాలయం



**కడప, మన జనప్రగతి ఏప్రిల్ 04:–**బ్రౌన్ బంగళా ప్రదేశంలో బ్రౌన్ జ్ఞాపకార్థం స్మారక గ్రంథాలయం ఆవిర్భవించడానికి ప్రధాన కారకులైన సి.కె.సంపత్ కుమార్ చిరస్మరణీయుడని, యోగ్యమైన దానం చేసి ఆయన తెలుగునేలంతటా కీర్తింపబడుతున్నారని యోగి వేమన విశ్వవిద్యాలయం బాధ్య కులసచివులు ఆచార్య పి.పద్మ అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శనివారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం స్థలదాత, ప్రముఖ ఛార్టెడ్ అకౌంటెంట్ సి.కె.సంపత్ కుమార్ 24వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాధ్య కులసచివులు ఆచార్య పి.పద్మ, సంచాలకులు ఆచార్య పి.పార్వతి, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది కలసి ముందుగా సి.కె.సంపత్ కుమార్ చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. అనంతరం ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ 1976లో జిల్లా రచయితల సంఘం సభలకు వచ్చిన ప్రముఖ కవి ఆరుద్ర, ఆచార్య జి.ఎన్.రెడ్డి, బంగోరె అప్పటి కలెక్టర్ డావ పి.ఎల్.సంజీవరెడ్డిని కలిసి సి.పి.బ్రౌన్ సాహిత్య యజ్ఞం జరిపిన స్థలంలో సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయాన్ని నిర్మించమని కోరారన్నారు. కలెక్టర్ డావ పి.ఎల్.సంజీవరెడ్డి అందుకు పూనుకొని జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు డా మల్లెమాల వేణుగోపాల రెడ్డిని, కార్యదర్శి డా జానమద్ది హనుమచ్ఛాస్త్రిని వెంటబెట్టుకొని వెళ్ళి స్థల యజమాని సి.ఆర్.కృష్ణస్వామిని కలిసి, శిథిలాలుగా ఉన్న బ్రౌన్ బంగళా 20 సెంట్ల స్థలాన్ని సి.పి.బ్రౌన్ జ్ఞాపకచిహ్నంగా నిర్మించే గ్రంథాలయానికి విరాళంగా ఇవ్వమని కోరారని, సి.ఆర్.కృష్ణస్వామి పెద్దమనసుతో అంగీకరించడం విశేషమన్నారు. అలా మాట ఇచ్చిన కృష్ణస్వామి 1978లో స్వర్గస్థులు కాగా ఆయన కుమారుడు సి.కె.సంపత్ కుమార్ తండ్రిమాటకు కట్టుబడి 1989 అక్టోబర్ 21న 20 సెంట్ల స్థలాన్ని బ్రౌన్ స్మారక గ్రంథాలయం కోసం రిజిస్టర్ చేయించారన్నారు. బ్రౌన్ గ్రంథాలయాన్ని మూడంతస్తుల జ్ఞానసౌధంగా తీర్చిదిద్దడం కోసం సంపత్ కుమార్, జానమద్ది హనుమచ్ఛాస్త్రి చేసిన కృషి విస్మరించరానిదన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ సి.కె.సంపత్ కుమార్ పుట్టుకలో ఒక ప్రత్యేకత ఉందని, సి.పి.బ్రౌన్ సాహిత్య యజ్ఞం జరిపిన బంగళాలోనే ఆయన పుట్టారన్నారు. సంపత్ కుమార్ సి.పి.బ్రౌన్ మెమోరియల్ ట్రస్టుకు అధ్యక్షులుగా ఉండి గ్రంథాలయ నిర్మాణానికి, అభివృద్ధికి చాలా సహకరించారన్నారు. ఆయన స్థలం ఇవ్వడం వల్లనే ఈ రోజు అనేక సభలు, సమావేశాలు, పుస్తక ప్రచురణ తదితర సాహిత్య వ్యాసంగాలతో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం విరాజిల్లుతోందన్నారు.సహాయ పరిశోధకులు డా.భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డా.చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణ రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకట రమణ,ఎం.మౌనిక,సిబ్బందినీలకంఠేశ్వర్, సుమతి, రాణి, అరుణ కుమారి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# నేతన్నలకు అండగా కూటమి ప్రభుత్వం

- మాధవరంలో 'సంపద సృష్టించే కేంద్రం' ఏర్పాటు




**సిద్దవటం మన జనప్రగతి ఏప్రిల్ 04:–** చేనేత కార్మికుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం రక్షణ గోడలా అండగా ఉంటుందని రాజంపేట టిడిపి ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు ధీమా వ్యక్తం చేశారు. శనివారం సిద్ధవటం మండలం మాధవరం–1 గ్రామంలో నిర్వహించిన చేనేత కార్మికుల అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జగన్మోహన్ రాజు మాట్లాడుతూ, చేనేత కుటుంబాల్లో వెలుగులు నింపడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రధాన లక్ష్యమని కొనియాడారు. మాధవరంలో త్వరలోనే 'సంపద సృష్టించే కేంద్రం' ఏర్పాటు కానుందని, దీనికి తగిన స్థలాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి ఇప్పటికే కలెక్టర్‌ను ఆదేశించారని వెల్లడించారు. చేనేత కార్మికులకు 200 యూనిట్లు, పవర్ లూమ్ కార్మికులకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు నాయకులు, కార్మికులు కలిసి పాలాభిషేకం నిర్వహించారు. కాగా, ఈ కార్యక్రమ నిర్వహణపై కొంతమంది కార్మికులు అసహనం వ్యక్తం చేశారు. చేనేత కార్మికుల కోసం కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన సొంత క్లస్టర్ భవనం అందుబాటులో ఉన్నప్పటికీ, అక్కడ కాకుండా సచివాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంపై సంబంధిత అధికారుల తీరును వారు తప్పుబట్టారు.ఈ కార్యక్రమంలో చేనేత శాఖ అధికారులు వనిత, రవిప్రకాష్ రావు, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ వీరభద్రుడు, కూటమి నేతలు మరియు పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# డ్రైయినేజీ కాలువల్లో పూడికతీత పనులు




**వేంపల్లె మన జనప్రగతి ఏప్రిల్ 04:–** వేంపల్లె లోని ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రధాన రహదారిలోని డ్రెయినేజీ కాలువల్లో ఉన్న మట్టిని జెసిబితో తొలగించారు. రెండు రోజుల క్రితం జరిగిన మండల సమీక్ష సమావేశంలో డ్రెయినేజీ కాలువల్లోని మట్టిని తొలగించకుండా కాలువలపై కప్పు వేయడం సరికాదని రోడ్డు భవనాల శాఖ అధికారిని పలువురు ఎంపిటిసిలు ప్రశ్నించారు. దీంతో మట్టిని తొలగించిన తర్వాతే డ్రెయినేజీ కాలువలపై కప్పును వేసేందుకు చర్యలు తీసుకొంటామని ఎఇ మనోహర్ రెడ్డి ప్రజాప్రతినిధులకు హామీ ఇవ్వడం జరిగింది. ఈనేపథ్యంలో శనివారం కడప రోడ్డులోని ప్రధాన రహదారిలో ఉన్న డ్రెయినేజీ కాలువల్లోని మట్టిని జెసిబి సహాయంతో తొలగించడం జరిగింది. కాలువలపై కప్పు వేసేందుకు కోసం పూర్తిగా మట్టిని జెసిబితో తొలగించాలని కాంట్రాక్టర్ కు ఆదేశాలు ఇచ్చినట్లు ఎఇ మనోహర్ రెడ్డి తెలిపారు. ఈమేరకు కాలువల్లో ఉన్న మట్టిని కాంట్రాక్టర్ తొలగిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తామని చెప్పారు. కాలువల్లో ఉన్న మట్టిని జెసిబితో తొలగిస్తుడడంతో అ ప్రాంతంలోని ప్రజలు కూడ హర్షం వ్యక్తం చేశారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
05 -04-2026

# సర్వే డే సందర్భంగా సర్వేయర్ల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన షాజహాన్ బాషా, సుగవాసి ప్రసాద్ బాబు



**మదనపల్లి మన జనప్రగతి ఏప్రిల్ 04:-** మదనపల్లి పట్టణంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజ్ ప్రాంగణంలో ఈరోజు సర్వే డే సందర్భంగా జిల్లా సర్వేయర్లు సంయుక్తంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మదనపల్లి ఎమ్మెల్యే శ్రీ షాజహాన్ బాషా, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు శ్రీ సుగవాసి ప్రసాద్ బాబు, హాజరై పోటీలను ప్రారంభించారు. అతిథులు క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించి సర్వేయర్లతో కలిసి కొద్దిసేపు క్రికెట్ ఆడి కార్యక్రమాన్ని మరింత ఉత్సాహంగా మార్చారు. అనంతరం సర్వేయర్లు అతిథులకు ఘన స్వాగతం పలికి పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూసర్వేయర్లు భూమి కొలతలు, ప్రభుత్వ భూ నిర్వహణ, అభివృద్ధి ప్రాజెక్టుల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రజలకు సేవలందించే సర్వేయర్ల పనితీరు అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే ఉద్యోగ ఒత్తిడిని తగ్గించుకునేందుకు ఇలాంటి క్రీడా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ టోర్నమెంట్ ద్వారా జిల్లా సర్వేయర్ల మధ్య ఐక్యత, స్నేహభావం పెరుగుతుందని, యువత క్రీడలవైపు ఆసక్తి పెంచుకోవాలని సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వేయర్లు, స్థానిక నాయకులు, కళాశాల ప్రతినిధులు, వివిధ మండలాల సర్వేయర్లు పాల్గొన్నారు.

# చిట్వేలి బస్టాండులో మౌలిక వసతులు కల్పించండి



**చిట్వేలి మన జనప్రగతి ఏప్రిల్ 04:-** మూడు దశాబ్దాల క్రితం కోట్లు విలువ చేసే స్థలంలో ఊరికి తలమానికంగా సువిశాలమైన ప్రాంగణంలో ఎంతో అద్భుతంగా చిట్వేలి ఆర్టీసీ బస్టాండ్ నిర్మించారు. సరియైన పర్యవేక్షణ లేక చుట్టూ ముళ్లకంపలు, చెత్తాచెదారంతో నిండిపోయింది. దుర్వాసనతో ప్రయాణికులు బస్టాండ్ అరుగుల మీద కూర్చోలేని దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడింది. ఆడపడుచులు, చక్కెర వ్యాధి గ్రస్తుల కొరకు మరుగుదొడ్లు లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. నాలుగేళ్ల క్రితం చిట్వేలి హెల్ప్ లైన్ సొసైటీ సొంత నిధులు 60,000 రూపాయల వరకు ఖర్చు చేసి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణమంతా శుభ్రపరచి, ప్రయాణికులకు ఉపయోగపడేలా మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. యువతతో కలిసి మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దారు. రాజంపేట డిపో మేనేజర్ సందర్శించి చిట్వేలి హెల్ప్ లైన్ సొసైటీ చూపిన చొరవను అభినందించారు. తర్వాత బస్టాండు బాగోగులు చూసుకోవడానికి ఒక మనిషిని ఏర్పాటు చేస్తామని చెప్పి వెళ్లారు. ఇంతవరకు అడ్రస్సు లేకుండా పోయారు. ఇప్పటికైనా బస్టాండు నందు మౌలిక వసతులు కల్పించాలని చిట్వేలి హెల్ప్ లైన్ సొసైటీ సభ్యులు కోరుతున్నారు.

# సితార హాస్పిటల్‌ను ప్రారంభించిన సుగవాసి ప్రసాద్ బాబు




**రాయచోటి మన జనప్రగతి ఏప్రిల్ 04:-** రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని గాలివీడు రోడ్, హరనాథవీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన సితార హాస్పిటల్ (ఆర్థో, స్పైన్ మరియు మెటర్నిటీ క్లినిక్) ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం ఉదయం ఘనంగా జరిగింది ఈ కార్యక్రమానికి రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు మరియు టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుగవాసి ప్రసాద్ బాబు మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రాయచోటి ప్రాంతంలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా ఎముకల వ్యాధులు, వెన్నుపూస సమస్యలు మరియు గర్భిణీ స్త్రీలకు అవసరమైన వైద్యం ఒకే ప్రాంగణంలో లభించడం వల్ల స్థానిక ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. వైద్య వృత్తి అనేది పరమ పవిత్రమైనదని, డాక్టర్ పగడాల మణికంఠ బాబు, డాక్టర్ భవ్య గారలు మానవీయ కోణంలో రోగులకు సేవలు అందించి సితార హాస్పిటల్‌ను ఆదర్శంగా నిలపాలని కోరారు. హాస్పిటల్ యాజమాన్యం ఆహ్వానం మేరకు విచ్చేసిన సుగవాసి, ఆసుపత్రిలోని అత్యాధునిక వైద్య పరికరాలను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వీరభద్రస్వామి ఆలయ మాజీ చైర్మన్ ఎద్దుల ప్రసాద్ లతో పాటు పట్టణంలోని పలువురు ప్రముఖ వైద్యులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు పట్టణ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. హాస్పిటల్ ప్రారంభోత్సవం సందర్భంగా స్థానికులు వైద్యులకు యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# నేమకల్లు అంజనేయునికి ప్రత్యేక పూజలు



**బొమ్మనహాల్ మన జనప్రగతి ఏప్రిల్ 04:-** మండల పరిధిలోని నేమకల్లు గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం అంజన్నకు వివిధ ప్రత్యేక పుష్పాలంకరణలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. అంజనేయ్య స్వామిని దర్శించుకోవడానికి నలుమూల ప్రాంతాల నుండి వేలాదిమంది భక్తులు హజరై అంజన్నకు మొక్కులను తీర్చుకున్నారు, ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు అనీల్ కుమార్ చార్యులు ఆధ్వర్యంలో అంజన్న స్వామికి విగ్రహానికి వేధమంత్రోచ్చారణల మధ్య అంజన్నకు ప్రత్యేక పూజలను నిర్వహించారు, తెల్లవారుజామునేపవిత్ర జలంను తీసుకోనివచ్చి స్వామీ వారి విగ్రహానికి అభిషేకంను నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ కుంకుమార్చన, పంచామృతాభిషేకం ఆకుల పూజ, ప్రత్యేక అలంకరణతో పూజలను నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నదాన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నసంతర్పన నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు అన్నదాన కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

# తూమకుంటలో ఇంకనూ నిర్మాణంలో ఉన్న100 మెగావాట్ సోలార్ పవర్ ప్లాంట్ పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్ నిశాంత్ కుమార్



**రాయచోటి మన జనప్రగతి ఏప్రిల్ 04:-** అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం తూమకుంట గ్రామంలో హెచ్పిసిఎల్ రెన్యువబుల్ అండ్ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఆధ్వర్యంలో దాదాపు 500 ఎకరాల విస్తీర్ణంలో 500 మెగావాట్ సామర్థ్యంతో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో ఇంకనూ నిర్మాణ దశలో ఉన్న 100 మెగావాట్ సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు పనులను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ శనివారం ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ప్లాంట్ స్థలాన్ని కలెక్టర్ విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. ప్రాజెక్టు నిర్మాణ దశ, ఇప్పటివరకు పూర్తయిన పనులు, మిగిలిన పనుల పురోగతి తదితర అంశాలపై సంబంధిత అధికారులను, సైట్ ఇంజినీర్లను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను వేగవంతం చేసి వచ్చే నాలుగు నుండి ఐదు నెలల్లో మొత్తం ప్రాజెక్టును పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు సైట్ ఇంజినీర్ కలెక్టర్‌కు వివరించారు. ప్లాంట్ ఏర్పాటులో కొన్నిచోట్ల భూమి సంబంధిత సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం సహకారం అందించాలని సైట్ ఇంజినీర్ కోరగా, సమస్యలపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. నివేదిక ఆధారంగా సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సోలార్ పవర్ ప్రాజెక్టు పూర్తయిన తరువాత ప్రాంతీయ విద్యుత్ అవసరాలకు గణనీయమైన మద్దతు లభించడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రాజెక్టు పనులు సమయానికి పూర్తి కావడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అదేవిధంగా పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా ప్రమాణాలు పాటించాలని, భద్రతా చర్యలు ఖచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రాజెక్టు పి.డి పురుషోత్తం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి దేవాలయంలో దాలమందరం ప్రతిష్టించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి





**రాయచోటి, మన జనప్రగతి ఏప్రిల్ 04:** రాయచోటి పట్టణంలోని సుద్దలోల్లపల్లె రోడ్డులో గుట్టపై వెలసిన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి భక్తిశ్రద్ధలతో దాలమందరం ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయానికి చేరుకున్న మంత్రివర్యులకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికి పూలమాలలు, శాలువాతో సన్మానించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు, నాయకులు పాల్గొని మంత్రికి స్వాగతం పలికారు. దేవుని ఆశీస్సులతో ప్రజలకు మరింత సేవ చేయాలని మంత్రి సంకల్పం వ్యక్తం చేశారు.

# ముఖ్యమంత్రికి ఇప్పటికైనా కనువిప్పు కలిగి తితిదేని ప్రక్షాళన చేయాలి: రాచమల్లు



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఏప్రిల్ 04:-** మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి శనివారం మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఆయన ప్రొద్దుటూరు నియోజకవర్గ వైసీపీ శ్రేణులతో కలిసి ఆయన ఆధ్వర్యంలో స్థానిక బొల్లవరంలో వున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం బి.ఆర్. నాయుడు పాలనలో అపచారాలకు నిలయంగా మారిందని దుయ్యబట్టారు. బి.ఆర్. నాయుడు చేసిన చర్యలు, వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గమైనవని మండిపడ్డారు. 40 ఏళ్ల ప్రయాణంలో ఒక స్త్రీని ముట్టుకోవడం, కౌగిలించుకోవడం తప్పేంటని బి.ఆర్. నాయుడు వ్యాఖ్యానించడం చూస్తుంటే ప్రజలు ఆశ్చర్యపోతున్నారని ఇలాంటి వ్యక్తి టిటిడి చైర్మన్‌గా ఉండటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. తిరుమల పవిత్రతను కాపాడాలంటే తక్షణమే బి.ఆర్. నాయుడుని టిటిడి పాలకమండలి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అతనికి బదులుగా మరో వ్యక్తిని ఆ స్థానంస నియమించుకోవాలని, ఇలాంటి వారిని కొనసాగించవద్దని అన్నారు. మూర్ఖపు మాటలు మాట్లాడుతున్న వ్యక్తిని ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంతకంటే పెద్ద మూర్ఖుడని ఘాటుగా విమర్శించారు. బాంబు పేలుడు నుంచి వెంకటేశ్వర స్వామే తనను కాపాడారని చెప్పుకునే చంద్రబాబు నిజమైన భక్తుడైతే లడ్డూ ప్రసాదంపై అబద్ధపు ప్రచారాలు చేస్తారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో లడ్డూలో పంది కొవ్వు కలిసిందని ప్రచారం చేయడం పవిత్ర ప్రసాదాన్ని పంది కొవ్వుతో పోల్చడం క్షమించరాని నేరమని అన్నారు. రాజకీయ లబ్ధి కోసం అధికార యంత్రాంగాన్ని తప్పుదోవ పట్టించి అబద్ధాలను నిజం చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం కుట్రలు చేస్తున్నారన్నారు. బి.ఆర్. నాయుడు పదవిలో కొనసాగడం హిందూ భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని వెంటనే ఆయనను ఆ స్థానం నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు పోరెడ్డి నరసింహారెడ్డి, పట్టణ వైసీపీ అధ్యక్షులు భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి, వైసీపీ నియోజకవర్గ శ్రేణులు, వైసీపీ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ మారెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట వేడుకలు



**కడప మన జనప్రగతి ఏప్రిల్ 04:-** కడప నగరంలోని రెండో పోలీస్ స్టేషన్ దగ్గర ఉన్న మంగళ వీధిలో శనివారం మారెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది ఈ కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్తలు గండికోట విజయ్ కుమార్ ఆధ్వర్యంలో భారతీయ హిందూ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు కల్లూరి విజయానంద రెడ్డి సహకారంతో ఉదయం ఏడు గంటల నుండి అనేక పూజా కార్యక్రమాలతో విగ్రహ ప్రతిష్ట ఘనంగా చేశారు .ఈ కార్యక్రమానికి ఎంతో మంది ప్రముఖులు హాజరై మారమ్మ తల్లి దీవెనలు పొందారు. ఈ కార్యక్రమానికి వచ్చిన భక్తులందరికీ మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న కడప విజయదుర్గాదేవి టెంపుల్ చైర్మన్ దుర్గాప్రసాద్ .అలంఖాను పల్లి లక్ష్మారెడ్డి .మైదుకూరు మాజీ మున్సిపల్ చైర్మన్ మాచునూరు చంద్ర, టూ టౌన్ సిఐ ప్రసాద్ రావు, మాజీ కార్పొరేటర్లు రామకోటి రెడ్డి, రామలక్ష్మి రెడ్డి, శ్రీధర్, గండికోట వినయ్ కుమార్ అనేకమంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న మేడా విజయ శేఖర్ రెడ్డి



**సుండుపల్లి మన జనప్రగతి ఏప్రిల్ 04:-** సుండపల్లి మండలం, పొలిమేరపల్లి పంచాయితీ పరిధిలోని పెద్దపల్లి గ్రామంలో వెలసిన శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామస్తుల సాదర ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీ మేడా విజయ శేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనకు ఘనస్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం మేడా విజయశేఖర్ రెడ్డి స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని వీక్షించారు.

# టీటీడీ చైర్మన్‌ను పదవి నుంచి తొలగించాలి



**కడవ మన జనప్రగతి ఏప్రిల్ 04:-** టీటీడీ చైర్మన్ బిఆర్.నాయుడును పదవి నుంచి తొలగించాలని వైసీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కడప నగరంలోని పవిత్ర పుణ్య దేవస్థానమైన దేవుని కడప వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో 101 టెంకాయలు కొట్టి వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం అంజబ్బాషా మాట్లాడుతూ బి ఆర్ నాయుడు అనైతిక కార్యకలాపాలు, ఆయన వ్యవహార శైలితో టీటీడీ పవిత్రతను దెబ్బతీస్తున్నారని పేర్కొన్నారు. ఆయనకు మంచి బుద్ధి ప్రసాదించాలని ప్రత్యేక పూజలు చేశామన్నారు. బిఆర్ నాయుడు టీటీడీ చైర్మన్ పదవి నుంచి వెంటనే తొలగించి టిటిడి పవిత్రతను కాపాడాలని డిమాండ్ చేశారు. మాజీ మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి., మాజీ మేయర్ పాకా సురేష్, జయ చంద్రారెడ్డి .దాసరి శివ. కడప జిల్లా మహిళా అధ్యక్షురాలు తెలుగుపులివెంకటసుబ్బమ్మ, వైసీపీ నగర అనుబంధసంఘ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# సీతారామ కళ్యాణం కార్యక్రమంలో పాల్గొన్న యలటూరి శివరామరాజు


**రాజంపేట మన జనప్రగతి ఏప్రిల్ 04:-** నందలూరు మండలం పరిధిలోని నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీకి చెందిన కుమ్మరపల్లి, గొల్లపల్లి, అరవపల్లె, తోటపాలెం గ్రామాలలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమాలలో రాజంపేట జనసేన పార్టీ నాయకులు, మాజీ జడ్పిటిసి సభ్యులు యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్ పాల్గొన్నారు. అరవపల్లె తోటపాలెం గ్రామంలో శ్రీ సీతారాముల గ్రామోత్సవానికి యల్లటూరు శివరామరాజు , సమ్మెట శివప్రసాద్ ఆర్థిక సహాయం అందజేశారు .ఈ కార్యక్రమంలో తోట శివశంకర్, సూరి తదితర గ్రామ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతన్న,నేతన్నలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



**రాజంపేట మన జనప్రగతి ఏప్రిల్ 04:-** ఆంధ్రప్రదేశ్‌లో చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు తెలిపారు ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాల్లో నిర్వహించిన ఉచిత విద్యుత్ అవగాహన సదస్సులో పాల్గొన్న ఆయన, చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకం వరమని పేర్కొన్నారు. మగ్గాలకు 200 యూనిట్లు, పవర్లూమ్‌లకు 500 యూనిట్లు ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు.చేనేత రంగం బలపడితే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, చేనేత వస్త్రాలపై జీఎస్టీ తొలగించడం వంటి చర్యలు తీసుకున్నామని తెలిపారు. చేనేతలంతా ఐక్యంగా ఉండి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు

## పుష్పగిరి బ్రహ్మోత్సవాలకు పీఠాధిపతికి ఆహ్వానం



**చెన్నూరు మన జనప్రగతి ఏప్రిల్ 04:-** బ్రహ్మోత్సవాలు ఈనెల 21 నుంచి 23 వరకు.వల్లూరు మండలంలోని అత్యంత ప్రసిద్ధి చెందిన దక్షిణకాశీ ,పంచనదీ క్షేత్రం పుష్పగిరి బ్రహ్మోత్సవాలకు పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకర భారతికిశ్రీ వైద్యనాథ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు రాజేష్ శర్మ హైదరాబాద్ బేగంపేట్ పుష్పగిరి మఠంలోఆహ్వానించినట్లు శనివారం విలేక రులకు తెలిపారు .పుష్పగిరి బ్రహ్మోత్సవాలు ఈనెల 15 నుంచి 23 వరకు జరగనున్నట్లు చెప్పారు.పీఠాధిపతి ఈ మాసం 21వ తేదీ శంకర జయంతి కావటంతో ఆరోజే రథోత్సవం నిర్వహిం చుకోవాలని ఆయన ఆజ్ఞాపించినట్లు రాజేష్ వెల్లడించారు.

## పెన్నహోబిలంలో అభివృద్ధి శకం మళ్లీ ప్రారంభం



**ఉరవకొండ, మన జనప్రగతి ఏప్రిల్ 04:-** పెన్నహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి ఈఓగా సాకే రమేష్ బాబు మళ్లీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన చేపట్టిన అభివృద్ధి పనులు క్షేత్రానికి కొత్త రూపు తీసుకొచ్చాయి.ఇప్పుడు ఆయన పునరాగమనం నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న నూతన రథం నిర్మాణం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు వేగం అందుకోనున్నాయని భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా తిరుమల్ రెడ్డి కుమార్తె సి. దక్షితా రెడ్డి నిత్య అన్నదానానికి ₹10,000 విరాళం అందించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరువు మన జనప్రగతి ఏప్రిల్ 04:-** నియోజకవర్గంలో నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 75 మంది లబ్ధిదారులకు రూ.30 లక్షల 67 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి కీలకంగా ని లుస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ బాల్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలి: ప్రసన్న కుమారి పిలుపు




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఏప్రిల్ 04:-**నేటి సమాజంలో ప్రతిరోజు విచ్చలవిడిగా జరుగుతున్న ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని స్థానిక రెవిన్యూ శాఖ అధికారిని ప్రసన్న కుమారి పిలుపునిచ్చారు హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం కల్లూరు గ్రామంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ వారి సహకారంతో నిర్వహించిన నిర్వహించిన డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అవేర్నెస్ ప్రోగ్రాంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అవగాహన పెంపొందించుకొని అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని ఆమె తెలిపారు గుర్తు తెలియని వ్యక్తులు అడిగే ఓటీపీలకు సమాధానం ఇవ్వరాదని అనవసరమైన లింకుల మీద క్లిక్ చేయరాదని ఆమె హెచ్చరించారు ప్రతి ఒక్కరు చైతన్యవంతంగా వెళ్లాలని ఒకరికి పదిమందికి అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని ఆమె తెలిపారు. స్థానిక సచివాలయ అధికారి కిరణ్ కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు గుర్తుతెలియని వ్యక్తులకు ఆధారం ఏటీఎం కార్డు నెంబర్లు చెప్పకూడదని సూచించారు కృష్ణ యాదవ్ మాట్లాడుతూ సైబర్ నేరాలకు అడ్డుకట్ట 1930 టోల్ ఫ్రీ నెంబర్ అని తెలిపారు క్రైమ్ జరిగిన తక్షణమే 1930కు సమాచారం ఇస్తే తక్షణమే వారి డబ్బుకు రక్షణ కలుగుతుందని ఆయన తెలిపారు టోల్ ఫ్రీ నెంబర్ ప్రజల్లో విస్తృతంగా తెలియాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. బ్రోచర్లు కరపత్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని అవగాహన పెంపొందించుకోవాలని కోరారు సైబర్ నేరాల పట్ల తమతో పాటు తమ చుట్టుప్రక్కల వారికి చైతన్యం కల్పించాలని ఆయన సూచించారు ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె ఉదయ్ కుమార్ మాట్లాడుతూ బ్యాంకు యొక్క లావాదేవీలు విధులు విధానాలపై సంపూర్ణంగా ప్రజలకు అవగాహన కల్పించారు రాటా కళాబృందం వారు పాటల ద్వారా ఇంద్రజాలం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు స్థానిక ప్రజలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## నాగార్జున రెడ్డికి అన్నామలై యూనివర్సిటీ డాక్టరేట్



**కడప మన జనప్రగతి ఏప్రిల్ 04:-**యోగివేమన విశ్వవిద్యాలయం భూగర్భ శాస్త్రం విభాగ అకడమిక్ కన్సల్టెంట్ గా పనిచేస్తున్న ఎం.నాగార్జున రెడ్డికి అన్నామలై విశ్వవిద్యాలయం (చిదంబరం ) అకడమిక్ రీసెర్చ్ డైరెక్టర్ డా. శక్తివెల్ డాక్టరేట్ ను ప్రకటించారు. ఆ విశ్వవిద్యాలయ భూగర్భ శాస్త్రంసహాయ ఆచార్యులు, డాక్టర్ పి. ఆనందన్ (గైడ్) , యోగి వేమన విశ్వవిద్యాలయం ఎర్త్ సైన్స్ సహ ఆచార్యులు డాక్టర్ టి. లక్ష్మి ప్రసాద్ (కో గైడ్) పర్యవేక్షణలో “ఆంధ్రప్రదేశ్, అనంతపురము జిల్లా, తాడిపత్రి మండలంలోని భూగర్భ జలాల భూరసాయన శాస్త్రంపై ఒక అధ్యయనం“ అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని అన్నామలై విశ్వవిద్యాలయునికి సమర్పించారు. ఈ మేరకు ఎం.నాగార్జున రెడ్డికి డాక్టరేట్ ప్రకటించారు. ఈయన రాసిన పరిశోధన పత్రాలు పలు జాతీయ అంతర్జాతీయ జర్నల్స్ లో ప్రచురితమయ్యాయి. ఈ సందర్భంగా వైవీయూ భూగర్భ శాస్త్రం ఆచార్యులు సహచర అధ్యాపకులు సిబ్బంది నాగార్జున రెడ్డిని అభినందించారు.

## జోయాలుక్కాస్ కాకినాడలో 2026 ఏప్రిల్ 4వ తేదీ నుండి ‘బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో’తో వెలిగిపోనుంది





**కాకినాడ, మన జనప్రగతి ఏప్రిల్ 04:-** మార్చి 2026 ద వరల్డ్స్ ఫేవరెట్ జ్యువెలర్, జోయాలుక్కాస్, కాకినాడలో ఏప్రిల్ 4, 2026 నుండి కాకినాడ షోరూమ్‌లో బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షోతో కాంతి విరజిమ్మడానికి సిద్ధంగా ఉంది. ఈ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రదర్శన వజ్రాల ఆభరణాలలో నైపుణ్యం, సొగసు మరియు ఆవిష్కరణల యొక్క మరపురాని వేడుకగా ఉంటుందని వాగ్దానం చేస్తుంది.పెళ్లి సెట్ల నుండి ఆధునిక రోజువారీ మెరుపు వరకు, ఈ ప్రదర్శనలో శాశ్వత సంప్రదాయాన్ని ఆధునిక సౌందర్యంతో మిళితం చేసే ఆభరణాలు ఉన్నాయి. ప్రతి డిజైన్ ఒక కళాఖండం, ఇది ప్రదర్శన సమయంలో మాత్రమే పరిమిత కాలానికి అందుబాటులో ఉంటుంది.జోయాలుక్కాస్ గ్రూప్ ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జోయ్ అలుక్కాస్ ఇలా అన్నారు: “బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో అనేది వజ్రాల శాశ్వత ఆకర్షణకు మరియు ఆభరణాల రూపకల్పనలో పరిపూర్ణత పట్ల మాకున్న అభిరుచికి నివాళి. కాకినాడ మా ప్రయాణంలో ఒక ప్రత్యేక మైలురాయి, మరియు పండుగ సీజన్‌లో ఈ ప్రదర్శన వినియోగదారులకు అందం, వ్యక్తిత్వం మరియు నైపుణ్యాన్ని ప్రతిబింబించే డిజైన్‌లను కనుగొనడానికి ప్రత్యేక అవకాశాన్ని అందిస్తుంది.“ఈ బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో హైదరాబాద్‌లోని పంజాగుట్ట షోరూమ్‌లో మాత్రమే, 2026 ఏప్రిల్ 19 వరకు నిర్వహించబడుతుంది. విలాసానికి, ప్రేమకు మరియు శాశ్వతమైన అందానికి చిహ్నంగా నిలిచే ఈ అద్భుతమైన వజ్రాల ప్రపంచాన్ని సందర్శించవలసిందిగా అందరినీ ఆహ్వానిస్తున్నాము. ఇక్కడ ప్రతి ఆభరణం ఒక అందమైన కథను వినిపిస్తుంది.

## జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఏప్రిల్ 04:-** కర్నూలు బార్ అసోషియేషన్ న్యాయవాది షాషావలి, ఆఫీస్ జూనియర్ న్యాయవాది మహమ్మద్ ఆజం జూనియర్ సివిల్ జడ్జి గా ఎంపిక అయిన సందర్భంగా న్యాయవాదులు అతన్ని సన్మానించారు. శనివారం కర్నూలు బార్ అసోసియేషన్ న్యాయవాదులు శ్రీనివాసులు, షుజావుద్దీన్ అహ్మద్,సయ్యద్ ఖుద్రతుల్లా ఖాద్రీ, మహమ్మద్ రఫీ, మరియు న్యాయవాద మిత్రులు శేషయ్య, గంగా శ్రీనివాసులు, అనసూయ, శ్వేతబిందు, అర్షియ, రసూల్ ఖాన్, ఇమ్రాన్ ఖాన్ తదితరులు అతనికి షాలో కప్పి పూలమాలతో సన్మానించారు. కర్నూలు జిల్లా వాసి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు.

## డ్రైవర్స్ కాలనీలో వైభవంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి ‘మండల పూజ’



**ఉరవకొండమన జనప్రగతి ఏప్రిల్ 04:-** స్థానిక డ్రైవర్స్ కాలనీలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి సహిత శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 07-04-2026 (మంగళవారం) నాడు మండల పూజ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.40 రోజుల వేడుకశ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం జరిగి 40 రోజులు పూర్తి కావస్తున్న సందర్భంగా ఈ విశేష మండల పూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నలభై రోజులు స్వామివారికి జరిగిన ప్రత్యేక ఆరాధనలకు ముగింపుగా ఈ పూజా కార్యక్రమం శాస్త్రోక్తంగా జరగనుంది. అన్నప్రసాద వితరణమండల పూజను పురస్కరించుకుని మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటలకు భక్తులందరికీ భారీ ఎత్తున అన్నప్రసాద వితరణ (అన్నదానం) కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఆలయ కమిటీ విజ్ఞప్తి:ఉరవకొండ గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల భక్తాదులు అందరూ అధిక సంఖ్యలో తరలివచ్చి, మండల పూజలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆలయ కమిటీ కోరింది. భక్తుల సౌకర్యార్థం డ్రైవర్స్ కాలనీలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిటీ సభ్యులు ఎయిర్ టెల్ ప్రతాప్ వెల్లడించారు.

## ఉరవకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా ‘కల్చరల్ అండ్ స్పోర్ట్స్ వీక్’



**ఉరవకొండమన జనప్రగతి ఏప్రిల్ 04:-** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (సెంట్రల్) నందు విద్యార్థినీ విద్యార్థులకు శనివారం సాంస్కృతిక మరియు క్రీడా వారోత్సవాలను అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి మరియు ఎక్స్ అఫీషియో ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎం. ప్రసాద్ బాబు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బహుమతుల ప్రధానంఈ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు మెడల్స్ (పతకాలు) అందజేసి వారిని ప్రోత్సహించారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ మరియు జానపద నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.ముఖ్య అతిథి సందేశంఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గౌరవనీయులైన మండల విద్యాశాఖాధికారి-2 రమాదేవి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థి దశలో చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అవసరమని, ఇవి మానసిక ఉల్లాసంతో పాటు వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడతాయని ఆమె వివరించారు.పాల్గొన్న ప్రముఖులుఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. ఖాదర్ బాషా, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. క్రీడా పోటీల నిర్వహణలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీమతి చందా మమతా ప్రసాద్, రాయుడు కీలక పాత్ర పోషించారు. విద్యార్థుల ప్రతిభను చూసి ఉపాధ్యాయులు మరియు తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

## కడప ప్రజల కోసం కార్పొరేషన్‌తో మిస్డ్ కాల్ ఉద్యమం: కాంగ్రెస్ నగర అధ్యక్షుడు సయ్యద్ గౌస్ పీర్




**కడప మన జనప్రగతి ఏప్రిల్ 04:-** కడప ప్రజల కోసం కార్పొరేషన్ తో మిస్డ్ కాల్ ఉద్యమంతో పాటు ఎస్సీ ఎస్టీ, లకు న్యాయం జరిగే వరుకు కాంగ్రెస్ పోరాటం చేస్తూనే ఉంటుందని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు సయ్యద్ గౌస్ పీర్ అన్నారు. శనివారంకడప నగరంలోని కాగితాల పెంట నగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ గత సంవత్సర కాలం నుండి ప్రజా సమస్యలపై ఎన్నో అర్జీలు ఇచ్చిన వాటి పై ఎటువంటి కార్యాచరణ లేదు, మాటలు మార్చుకుంటూ ఎటువంటి పురోగతి లేకుండా ఇచ్చిన అర్జీలను చెత్తబుట్టలో వేస్తూ కాలయాపన చేస్తూ అధికార పార్టీకి మాత్రం ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవడంలో నిమగ్నమైన కడప నగర కమిషనర్ ఆదివారం అయినా మహిళా దినోత్సవ కార్యక్రమంలో తన సమయాన్ని అంతా వెచ్చించి పాల్గొనగా ఆరోజు మేము కాల్ చేసి కలవాలని అడగగా అధికార పార్టీ కార్యక్రమంలో ఉన్నాను అన్నప్పుడు మాకు ఐదు నిమిషాలు టైం ఇవ్వండి అర్జీ ఇచ్చి వెళ్తాము అనగా మేడా కన్వెన్షన్ హాల్ సమీపాన గల సర్కిల్ కు రమ్మన్నారు. అక్కడ మేము కలవగా మాపై దుర్భాషలాడి అర్జీ తిరస్కరించి వెళ్లారు. తర్వాత అర్జీలను పాడెగడుతున్నాడు అని అర్జీ పాడే కట్టి నిరసన కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ తరపున మేము పెద్ద ఎత్తున జరిగిన, ఆ సమయంలో నగర కమిషనర్ కు మరొక అర్జీ కూడా ఇచ్చాము, ఆ సందర్భంలో కమిషనర్ మాతో ప్రజాముకంగా పది రోజుల్లో ఇచ్చిన అర్జీలు అన్నిటిని పరిష్కరిస్తానని మాట ఇచ్చారు. కానీ ఆ మాటకు పాడేగట్టి సమస్యల పరిష్కార దశగా ఎటువంటి అడుగు వెయ్యలేదు. ఏం సార్ అని అడిగితే వారం రోజుల నుండి లేను ఢిల్లీకి వెళ్లాను కథలు చెప్పగా రంజాన్ రోజు ఈదగాలో నా పక్కనే ఉన్నారు. సార్ అనగా కంగుతిన్న కమిషనర్ లేదు వచ్చి వెళ్లానని అబద్ధపు మాటలతో కప్పిపుచ్చాలని ఇచ్చాడు. ఇలా మాట మార్చుకుంటూ వెళ్తే ప్రజల సమస్యలు ఎలా తీరుస్తారు, అధికార పార్టీ పనులు మాత్రమే చేస్తాను అన్నప్పుడు వెళ్లి కండువా కప్పుకుని చేస్తుంటే మంచిది కదా నా అభిప్రాయం. ఇప్పటికైనా ప్రజలు మేల్కొని ఇలాంటి వారికి తగిన బుద్ధి చెప్పాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండాలి ఎందుకంటే కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాల మైనార్టీ వర్గాల మధ్యతరగతి వర్గాల పార్టీ అని నొక్కి వక్కాణించారు. అలాగే ఇటీవల గౌరవ సుప్రీంకోర్టు మతమార్పిడి తీసుకున్నవారికి రిజర్వేషన్లు చెల్లవు అన్నదానిపై స్పందిస్తూ మతం అనేది ఎవరు ఎలా అయినా మారవచ్చు దానిని రాజ్యాంగం లోనే సూచించారు కానీ కులం అనేది పుట్టుకతో వచ్చేది దానిని ఎవరూ మార్చలేరు, వారికి ఉండవలసిన హక్కులు వారికి ఉండాలని ఈ విషయంలో పిసిసి అధినేత షర్మిలమ్మ తన వాదనను వినిపిస్తూ ముందుకు సాగుతుంది. ఆమెకు మద్దతుగా ఉంటామని కులానికి మతానికి లింకు పెట్టకూడదని వివరించారు. కడప డివిజన్ ఇంచార్జ్ అంజన్ కుమార్, జాబిర్ అలీ, హాజీ భాయ్, సౌదాకర్ సాదిక్,ముబారక్, సిద్ధిక్, సయ్యద్ అన్వర్ కె ఎం డబ్లు ఏ, సుబ్రహ్మణ్యం, కరీం భాయ్, సర్దార్ బాయ్, ముబారక్, సద్దాం, మహబూబ్ బాషా, పటాన్ నసీర్ ఖాన్, నాసిర్ ఖాన్, ఫహీం, కరిముల్లా, హమీదా ఖానామ్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
05 -04-2026

# ఎన్నికల వార్డుల విభజన ప్రక్రియ అప్రమత్తంగా చేపట్టండి

**• ఏప్రిల్ 10 నుండి 16 వరకు ప్రజల అభిప్రాయాలు తెలియజేయవచ్చు: కమిషనర్ ఎన్.మౌర్య**




**తిరుపతి మన జనప్రగతి ఏప్రిల్ 04:-** రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తిరుపతి నగరంలో పెరగనున్న ఎన్నికల వార్డుల విభజన, పెంపు ప్రక్రియను అప్రమత్తంగా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలో జనాభా ప్రాతిపదికన ఎన్నికల వార్డుల విభజన, పెంపుపై నగరపాలక సంస్థ రెవిన్యూ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, స్వర్ణ వార్డు కార్యదర్శులతో శనివారం కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని మునిసిపల్ కార్పొరేషన్ లలో జనాభాకు అనుగుణంగా ఎన్నికల వార్డుల సంఖ్య పెంచేందుకు ఏప్రిల్ 1 తారీఖున జీవో విడుదల చేసిందని తెలిపారు. ఆ మేరకు తిరుపతి నగరపాలక సంస్థలోని 50 వార్డులను 66 వార్డులకు పెంచేలా నిర్ణయించారని తెలిపారు. ఈ వార్డుల విభజన, పెంపు ప్రక్రియ లో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహారించాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో సర్వే నెంబర్లు, జనాభా, తదితర వాటిని ప్రామానికంగా జాగ్రత్తగా పరిశీలించి విభజన చేయాలని తెలిపారు. ఈ నెల 9వ తేదీ లోపు వార్డుల విభజన ప్రక్రియ ముసాయిదా సిద్ధం చేయాలని తెలిపారు. వార్డులను విభజించే ప్రతిపాదనను ఫారం 1 ద్వారా 10 వ తేదీ నుండి 16 వ తేదీ వరకు నగరపాలక సంస్థ నోటీసు బోర్డు, ఇతర ప్రకటనల ద్వారా ప్రజల అభ్యంతరాల కొరకు ఉంచాలని తెలిపారు. 25 వ తేదీ లోపు మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా ఎన్నికల వార్డుల విభజన ప్రతిపాదనలను ఖరారు చేసి, మున్సిపల్ పరిపాలన కమిషనర్ & డైరెక్టర్‌కు సమర్పించడం జరుగుతుందని తెలిపారు. మే రెండవ తేదీ లోపు ప్రజల నుండి వచ్చిన వినతిపత్రాలను, మున్సిపల్ కార్పొరేషన్ యొక్క అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తరువాత, మున్సిపల్ పరిపాలన కమిషనర్ & డైరెక్టర్ చేత మున్సిపల్ కార్పొరేషన్ యొక్క వార్డు విభజన ప్రతిపాదనలకు ఆమోదం తెలపడం జరుగుతుందని తెలిపారు. మే 5వ తేదీ లోపు కమిషనర్ ద్వారా ఆంధ్రప్రదేశ్ గెజిట్‌లో ఫారం 6 లో తుది నోటిఫికేషన్ ప్రచురణ చేయడం జరుగుతుందని తెలిపారు. అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డిసిపీలు ఖాన్, దేవి కుమారి, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, ఏసీపీలు పార్వతి ప్రియ, మూర్తి, సర్వేయర్లు కోటేశ్వరరావు, గురువా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కాలనీ వాసులకు రోడ్ల కష్టాలు.. జాయింట్ కలెక్టర్, ఆర్డీవో పరిశీలన

**• ఇళ్ల కంటే ఎత్తులో డ్రైనేజీలు,కరెంట్ లైన్లు • కాలనీవాసుల ఆవేదన**

**• వర్షపు నీరు,దుమ్ముతో తీవ్ర ఇబ్బందులు.**

**• సమస్యల పరిష్కారానికి అధికారులకు వినతిపత్రాలు**



**తొండూరు మన జనప్రగతి ఏప్రిల్ 04:-**స్థానిక తొండూరు మండలంలోని తొండూరు,మల్లెల గ్రామాల మీదుగా వెళుతున్న నేషనల్ హైవే ఎస్సీ కాలనీ వాసులకు శాపంగా మారింది. కాలనీలో ఇళ్ల కంటే ఎత్తులో డ్రైనేజీ కాలువలు, కరెంట్ లైన్లు ఏర్పాటు చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కాలనీవాసులు శనివారం జరిగిన జాయింట్ కలెక్టర్,ఆర్డీవో పరిశీలన సందర్భంగా తమ సమస్యలను వినిపించారు. హైవే నిర్మాణం కారణంగా తమ ఇళ్లు కిందికి పడిపోయినట్లు ఉండటంతో వర్షపు నీరు, దుమ్ము నేరుగా ఇళ్లలోకి చేరి ఇబ్బందులు పెడుతున్నాయని వివరించారు. నేషనల్ హైవే అధికారులు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ జాయింట్ కలెక్టర్, ఆర్డీవోలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కాలనీకి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలపై ఏకగ్రీవంగా ఆవాజ్ వినిపించారు.

# రాజధానిగా అమరావతి చట్టబద్ధత

**పెట్టుబడులు, ఉపాధి పెరుగుతాయి: టీటీడీ సభ్యుడు, ఎమ్మెల్యే జ్యోతుల వెల్లడి**




**కాకినాడ మన జనప్రగతి ఏప్రిల్ 04:-** రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టబద్ధ కల్పించడంతో పెట్టుబడుదులు ఉపాధి వెలుగులో వస్తాయని తద్వారా ఎంతోమందికి ఉద్యోగాలు లభిస్తాయని టీటీడీ పాలక మండలి సభ్యుడు జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ) పేర్కొన్నారు. అమరావతి రాష్ట్రానికి రాజధాని కాకుండా ఏ దుష్టశక్తులు ఈసారి ఆపలేవని పరోక్షంగా మాజీ సీఎం వైయస్ జగన్‘ని ఆయన విమర్శించారు. రాజధాని అమరావతి అని లోక్ సభ, రాజ్యసభలు ఆమోదించడం పట్ల నెహ్రూ హర్షం వ్యక్తం చేశారు. శనివారం కాకినాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో నెహ్రూ విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతి పట్ల అవగాహన లేకుండా వైకాపా నేతలు అంబటి రాంబాబు, సజ్జల రామకృష్ణారెడ్డి, వై వి సుబ్బారెడ్డిలు మాట్లాడుతుండడాన్ని ఆయన తప్పు పట్టారు. అమరావతి పేరు చెప్పడానికి కూడా జగన్ మనసు అంగీకరించడం లేదని ఇదే విధానాన్ని కొనసాగితే వెంట ఉన్న ఆ 11 మంది కూడా ఉండరని విమర్శించారు. అమరావతి 6 కోట్ల ఆంధ్రుల రాజధాని అని అన్ని ఒక్క వైసీపీ తప్ప పార్టీల నాయకులు అంగీకరించారని చెప్పారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు ఆలోచన ధోరణిని మార్చుకోవాలని నెహ్రూ సూచించారు. అనంతరం టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కొవ్వొత్తులతో దీపాలు వెలిగించి అమరావతి రాజధాని అంటూ నినాదాలు చేశారు. ఈ సమావేశంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వర రావు (కొండబాబు), జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా, సీనియర్ నాయకుడు నురుకుర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు...

# బంజారా సంస్కృతి వారసత్వ రక్షకుడిగా ఎస్.కె. సుబ్రహ్మణ్యం నాయక్ నియామకం



**ఉరవకొండ జనప్రగతి ఏప్రిల్ 04:-** సింధు నాగరికత కాలం నాటి నుండి విశిష్ట గుర్తింపు పొందిన బంజారా సంస్కృతీ సంప్రదాయాలను భావి తరాలకు అందించే క్రమంలో సద్గురు సేవాలాల్ మహారాజ్ చారిటబుల్ ట్రస్ట్ కీలక నిర్ణయం తీసుకుంది. రూపా నాయక్ తండాకు చెందిన బంజారా సంఘం ప్రతినిధి ఎస్.కె. సుబ్రహ్మణ్యం నాయక్ ను ట్రస్ట్ అనుబంధ విభాగాలకు కల్చరల్ అండ్ ట్రెడిషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏకగ్రీవంగా నియమించారు.నియామక పత్రాలు అందజేసిన రిటైర్డ్ ఐజీఈ మేరకు ట్రస్ట్ అధ్యక్షులు మరియు రిటైర్డ్ ఐజీ జగన్నాథరావు నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఆధునిక పోకడల వల్ల కనుమరుగవుతున్న బంజారా వేషధారణ, ఆచారాలను కాపాడటంలో సుబ్రహ్మణ్యం నాయక్ చూపిస్తున్న నిరంతర కృషిని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు ట్రస్ట్ వర్గాలు వెల్లడించాయి.సంస్కృతిని కాపాడటం సుబ్రహ్మణ్యం నాయక్ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం నాయక్ పాత్రికేయులతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు ఆసియా ఖండంలోనే ఆదర్శనీయమైన చరిత్ర కలిగిన బంజారా సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి యువతపై ఎంతైనా ఉంది తనపై నమ్మకంతో ఈ గురుతర బాధ్యతను అప్పగించిన ట్రస్ట్ అధ్యక్షులు జగన్నాథరావు, ఉపాధ్యక్షులు కేశవ నాయక్, వర్కింగ్ కమిటీ అధ్యక్షులు (రిటైర్డ్ ఎస్పీ) రవీందర్ నాయక్, కల్చరల్ ఆర్గనైజర్ (రిటైర్డ్ సిఐ) ఎస్.కె. రామచంద్ర నాయక్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేటాయించిన పదవికి త్రికరణ శుద్ధితో న్యాయం చేస్తానని, సమాజంలో బంజారా ఉనికిని, మానవ మనుగడను కాపాడేందుకు అంకితభావంతో శ్రమిస్తానని ఆయన పేర్కొన్నారు.నిర్వహణ: సద్గురు సేవాలాల్ మహారాజ్ చారిటబుల్ ట్రస్ట్.ఈ నియామకం పట్ల బంజారా సమాజం మరియు స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఇనగలూరు వైఎస్ఆర్ కాలనీలో నీటి కష్టాలు

**పనిచేయని మోటార్లతో తాగునీటి సరఫరా నిలిచింది.**

**వేసవిలో మరింత తీవ్రతరమైన నీటి కొరత**

**తక్షణ చర్యలు తీసుకోవాలని కాలనీవాసుల విజ్ఞప్తి**



**తొండూరు మన జనప్రగతి ఏప్రిల్ 04:-**మండల పరిధిలోని ఇనగలూరు గ్రామంలోని వైఎస్ఆర్ కాలనీలో గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. నీటి కొరత కారణంగా కాలనీవాసులు రోజువారీ అవసరాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న రెండు విద్యుత్ మోటార్లు పనిచేయకపోవడం వల్ల నీటి సరఫరా పూర్తిగా దెబ్బతింది. దీంతో తాగునీటి కోసం కాలనీవాసులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారు. నీటి కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో సమస్య మరింత తీవ్రమవుతోంది. తాగునీటి కొరతతో పాటు శుభ్రత సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం ప్రత్యేక అధికారులు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో నీటి సమస్యపై తక్షణమే స్పందించి, మోటార్లను మరమ్మతు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# బదిలీపై వెళుతున్న ట్రైనీ కలెక్టర్ రఘువంశీ దంపతులను సన్మానించిన నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య



**తిరుపతి మన జనప్రగతి ఏప్రిల్ 04:-** తిరుపతి నగరపాలక సంస్థ (మున్సిపల్ కార్పొరేషన్) కమిషనర్ ఎన్. మౌర్య బదిలీపై వెళుతున్న జిల్లా ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీ దంపతులను మర్యాదపూర్వకంగా సన్మానించారు. ట్రైనీ కలెక్టర్ గా తిరుపతి జిల్లాలో సేవలు అందించిన సందీప్ రఘువంశీ ఇటీవల బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఒక సాదా కానీ హృదయపూర్వక కార్యక్రమంలో కమిషనర్ మౌర్య రఘువంశీ దంపతులకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువా కప్పి సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో కమిషనర్ ఎన్. మౌర్య మాట్లాడుతూ, “తిరుపతి జిల్లా అభివృద్ధికి ట్రైనీ కలెక్టర్ రఘువంశీ చేసిన సేవలు అమూల్యమైనవి. ప్రజల సమస్యల పరిష్కారంలో, వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఆయన చూపిన నిబద్ధత, కృషి ప్రశంసనీయం. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా ప్రజా సేవ చేస్తారని ఆశిస్తున్నాం” అని అన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. రఘువంశీ దంపతులు తమ ప్రసంగంలో తిరుపతిలో గడిపిన రోజులను గుర్తుచేసుకుని, అందరి సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సన్మానం తిరుపతి జిల్లా అధికారుల మధ్య ఉన్న మంచి సంబంధాలను మరోసారి వెల్లడించింది.

# బ్రహ్మోత్సవాలకు సహాయ సహకారాలు అందించిన ప్రముఖులకు ఘన సత్కారం



**ఒంటిమిట్ట మన జనప్రగతి ఏప్రిల్ :-** స్థానిక శ్రీ కోదండరామ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు తమ వంతుగా విశేష సేవలందించిన పలువురు స్థానిక నాయకులను, ప్రముఖులను శనివారం గౌరవపూర్వకంగా సత్కరించారు. ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహ రాజు ఈ కార్యక్రమంలో పాల్గొని, ఉత్సవాల్లో తోడ్పాటు అందించిన వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ క్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు మాడా జయకృష్ణను సి.ఐ ప్రత్యేకంగా సన్మానించి, స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ.. పరమ పవిత్రమైన శ్రీ కోదండరాముని బ్రహ్మోత్సవాలలో తాను, తన మిత్ర బృందం పాల్గొని సేవ చేసుకునే భాగ్యం కలగడం పూర్వజన్మ సుకృతమని హర్షం వ్యక్తం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించిన సి.ఐ నరసింహ రాజు చేతుల మీదుగా ప్రసాదాన్ని అందుకోవడం సంతోషంగా ఉందని, రాబోయే కాలంలో స్వామివారి ఉత్సవాలు మరింత వైభవంగా, కనులపండువగా జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# విద్యుత్తు ఎస్ఇని కలిసిన బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘం



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఏప్రిల్ 04:** -శనివారం బీసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎస్పీడీసీఎల్ డిస్కం అధ్యక్షులు పీవీ మురళీమోహన్ ఆధ్వర్యంలో కడప జిల్లాకు నూతనంగా వచ్చిన సోమా శ్రీనివాసులు సూపరింటెడింగ్ ఇంజనీర్ ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది..ఈ కార్యక్రమం లో రీజనల్ అధ్యక్షులు బి ఎన్ మూర్తి మరియు ప్రొద్దుటూరు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు పి ఆంజనేయ రాజు, నాగరాజు, ఇంజనీర్స్ నాయకులు కృష్ణ కుమార్, సుధీర్, ప్రవీణ్ బీసీ నాయకులు శివప్రసాద్,రఘు జూనియర్ ఎల్ ఎం లు చైతన్య, రఘు, కాంటాక్ట్ కార్మిక నాయకులు నాగరత్నాచారి తదితరులు పాల్గొన్నారు.

# కోచింగ్ సెంటర్ల పేరిట యువత దోపిడీ

**- వెంటనే చర్యలు తీసుకోలి ఎం. అంకన్న**




**కడప మన జనప్రగతి ఏప్రిల్ 04:-** కోచింగ్ సెంటర్ల పేరిట యువత దోపిడీ జరుగుతోందని పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ ఫీజులు వసూలు చేస్తూ రసీదులు ఇవ్వకపోవడం, తప్పుడు హామీలు ఇవ్వడం, నకిలీ ఫలితాలతో విద్యార్థులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అర్హతలేని బోధకులు, కనీస సౌకర్యాల లేమి వల్ల విద్యార్థుల భద్రత ప్రమాదంలో పడుతోందన్నారు. కొన్నిచోట్ల మహిళలపై వేధింపుల ఆరోపణలు రావడం ఆందోళనకరమన్నారు. అక్రమ సెంటర్లపై వెంటనే తనిఖీలు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదాన సేవలు: మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్



**హైదరాబాద్ మన జనప్రగతి ఏప్రిల్ 04:-** రామచంద్రాపురం డివిజన్ శ్రీనివాస్ నగర్ కాలనీలోని మందుముల ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమంలో రామచంద్రపురం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హనుమాన్ జయంతి వేడుకలు, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే శ్రీనివాస్ నగర్ కాలనీలో వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజలలో కూడా పాల్గొన్నారు.

# విద్యుత్తు ఎస్ఇని కలిసిన బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘం

**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఏప్రిల్ 04:-** శనివారం బీసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎస్పీడీసీఎల్ డిస్కం అధ్యక్షులు పీవీ మురళీమోహన్ ఆధ్వర్యంలో కడప జిల్లాకు నూతనంగా వచ్చిన సోమా శ్రీనివాసులు సూపరింటెడింగ్ ఇంజనీర్ ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది..ఈ కార్యక్రమం లో రీజనల్ అధ్యక్షులు బి ఎన్ మూర్తి మరియు ప్రొద్దుటూరు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు పి ఆంజనేయ రాజు, నాగరాజు, ఇంజనీర్స్ నాయకులు కృష్ణ కుమార్, సుధీర్, ప్రవీణ్ బీసీ నాయకులు శివప్రసాద్,రఘు జూనియర్ ఎల్ ఎం లు చైతన్య, రఘు, కాంటాక్ట్ కార్మిక నాయకులు నాగరత్నాచారి తదితరులు పాల్గొన్నారు.



మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
05 -04-2026

# సైబర్ మాయగాళ్ల 'ఉచిత' వలకు చిక్కకండి

**ఫ్రీ వై-ఫై' ప్రమాదాలపై జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి హెచ్చరిక**

**సోషల్ మీడియాలో పుకార్లొద్దు.. బాధ్యతగా ఉండండి: జిల్లా ఎస్పీ**



**మదనపల్లె, మన జనప్రగతి ఏప్రిల్ 04:-** ఆధునిక కాలంలో పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల జిల్లా ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని, అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, ప్రజలకు సూచించారు. ముఖ్యంగా ఉచితంగా లభించే వై-ఫై నెట్‌వర్క్‌ల ద్వారా కొత్త రకమైన మోసాలు వెలుగులోకి వస్తున్నాయని, వీటి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.కాఫీ షాపులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి బహిరంగ ప్రదేశాల్లో లభించే ఉచిత వై-ఫై నెట్‌వర్క్‌ల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ సూచించారు. "ఫ్రీ వై-ఫై" పేరుతో జరుగుతున్న ఈ కొత్త రకమైన ఫిషింగ్ దాడుల ద్వారా మోసగాళ్లు మీ వ్యక్తిగత సమాచారాన్ని, మాల్వేర్ ద్వారా డేటాను తస్కరించే అవకాశం ఉందని హెచ్చరించారు. పబ్లిక్ వై-ఫై వాడుతున్నప్పుడు బ్యాంకింగ్ లావాదేవీలు, ఆన్‌లైన్ షాపింగ్ చేయవద్దు. అపరిచిత వై-ఫై హాట్‌స్పాట్‌లకు ఫోన్లను కనెక్ట్ చేయకపోవడమే శ్రేయస్కరం. ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్‌లతో పాటు 'టూ స్టెప్ వెరిఫికేషన్' తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి.ప్రభుత్వ పథకాల పేరుతో వచ్చే అపరిచిత లింకులను నమ్మి క్లిక్ చేయవద్దని ఎస్పీ స్పష్టం చేశారు. పథకాల దరఖాస్తు కోసం అధికారిక వెబ్‌సైట్లను మాత్రమే సంప్రదించాలని, ఎవరికీ బ్యాంక్ వివరాలు, ఓటీపీ లేదా పిన్ నంబర్లు పంచుకోవద్దని కోరారు. ఒకవేళ ఎవరైనా ఆర్థికంగా సైబర్ మోసానికి గురైతే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని లేదా www.cyber-crime.gov.in లో ఫిర్యాదు చేయాలని సూచించారు. **సోషల్ మీడియా లో.. జాగ్రత్త!** సోషల్ మీడియాలో బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాలని ఎస్పీ కోరారు. వాట్సాప్, ఫేస్‌బుక్ ఇతర సామాజిక మాధ్యమాలలో వచ్చే ప్రతి వార్తను నిజమని నమ్మి ఇతరులకు షేర్ చేయవద్దు. అది సమాజ శాంతికి భంగం కలిగించేలా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటాం. **అపరిచితులతో స్నేహం వద్దు:** ఫేక్ ప్రొఫైల్స్ ద్వారా వచ్చే రిక్వెస్ట్‌లను అంగీకరించవద్దు. ఆకర్షణీయమైన మాటలకు లోబడి వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు పంపించి ఇబ్బందుల్లో పడవద్దు. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టినా, రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా ఉపేక్షించేది లేదని, వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ నేరాల రహిత అన్నమయ్య జిల్లాగా తీర్చిదిద్దడంలో పోలీసులకు సహకరించాలని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి కోరారు.

# దలైలామాను కలిసిన బీసీ నేత డాక్టర్ అరుణ కుమార్



**హైదరాబాద్ మన జనప్రగతి ఏప్రిల్ 04:-** హిమాచల్ ప్రదేశ్ లోని టెన్జిన్ గ్యాట్సో (14వ దలైలామా)ను రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య తనయుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్. అరుణ్ కుమార్ కలిసి టిబెట్ ప్రజల స్వేచ్ఛ కోసం జరుగుతున్న పోరాటానికి తమ మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా అహింసా మార్గంలో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన దలైలామా అరుణ్ కుమార్ ను ప్రోత్సహిస్తూ ఆశీస్సులు అందజేశారు. శాంతి, కరుణ, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచిన దలైలామా మార్గదర్శనం యువతకు ప్రేరణగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఈ బేటి సామాజిక న్యాయం, మానవ హక్కులు, శాంతి కోసం కృషి చేసే నాయకుల మధ్య స్ఫూర్తిదాయకమైన అనుబంధాన్ని మరింత బలోపేతం చేసిందని ఆయన పేర్కొన్నారు.

# రైతులకు చుక్కలు చూపిస్తున్న విద్యుత్ ఏఈల ఖాళీ కుర్చీలు..!

**నెలరోజులుగా మూడు మండలాల్లో భర్తీ కాని ఏఈ పోస్టులు.**

**వ్యవసాయ పనులకు విద్యుత్ సమస్యలు తీవ్రం.**

**అధికారుల నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం.**

**ఫిర్యాదులు ఉన్నా స్పందన లేని పరిస్థితి.**

**పంటలపై ప్రభావం పడుతుందనే రైతుల ఆందోళన..**



**వేంపల్లి మన జనప్రగతి ఏప్రిల్ 04:-**వేంపల్లి సబ్‌డివిజన్ పరిధిలోని వేంపల్లి,చక్రాయపేట,వేముల మండలాల్లో గత నెల రోజులుగా విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) పోస్టు ఖాళీగా ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండాకాలం తీవ్రత పెరుగుతున్న ఈ సమయంలో వ్యవసాయానికి అత్యంత కీలకమైన విద్యుత్ సరఫరా విషయంలో బాధ్యత వహించే అధికారి లేకపోవడం పరిస్థితిని మరింత విషమం చేస్తోంది.వ్యవసాయ అవసరాలకు ఉపయోగించే ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ కాలిపోతుండగా,వాటి మార్పిడి,మరమ్మతులు ఆలస్యమవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న చిన్న విద్యుత్ లోపాలు వచ్చినా వెంటనే పరిష్కారం లభించక కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంది. సంబంధిత అధికారుల సంతకాలు,ఆమోదాలు లేకపోవడంతో ఫిర్యాదులు పెండింగ్‌లోనే ఉండిపోతున్నాయి.ఇప్పటికే సాగునీటి అవసరం పెరిగిన నేపథ్యంలో బోర్లు,మోటార్లు నిరంతరం నడపాల్సిన పరిస్థితి ఉంది. ఈ సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం,లైన్లలో లోపాలు ఏర్పడటం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.సమస్యలు వెంటనే పరిష్కారం కాకపోవడంతో పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోందని వారు వాపోతున్నారు.అధికారుల నిర్లక్ష్యం కారణంగా వ్యవసాయ సీజన్‌లో కీలకమైన ఏఈ పోస్టును ఖాళీగా ఉంచడం రైతుల పట్ల అన్యాయమని మండిపడుతున్నారు.ఇప్పటికే అప్పుల భారం మోస్తున్న రైతులకు విద్యుత్ సమస్యలు అదనపు భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **వెంటనే ఏఈ నియామకం చేయాలి:రైతుల హెచ్చరిక..** మూడు మండలాల్లో విద్యుత్ సమస్యలు తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో రైతులు తమ ప్రధాన డిమాండ్లను స్పష్టంగా వెల్లడించారు.వేంపల్లి,వేముల,చక్రాయపేట మండలాలకు తక్షణమే పూర్తి స్థాయి విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్‌ను నియమించాలని,కాలిపోయిన వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను ఆలస్యం లేకుండా మార్చాలని కోరుతున్నారు.విద్యుత్ ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని,ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నిరంతరంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని రైతులు హెచ్చరిస్తున్నారు.

# తిరుమల పవిత్రతను కాపాడి,దేవుళ్లను రాజకీయాలకు లాగకండి

**- రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్ కుమార్ రెడ్డి**

**రామాపురం మన జనప్రగతి ఏప్రిల్ 04:-**తిరుమల పవిత్రతను కాపాడాలని, దేవుళ్లను రాజకీయాలకు లాగవద్దని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. రామాపురం మండలంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పోస్టర్లు విడుదల చేశారు. తిరుమల లడ్డూపై తప్పుడు ప్రచారం చేసి ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నారని సీఎం చంద్రబాబు నాయుడుపై విమర్శలు చేశారు.అభివృద్ధి విషయంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, గత ప్రభుత్వ పనులను తప్పుబడుతున్నదని ఆరోపించారు. రాయచోటి జిల్లా కేంద్రాన్ని తొలగించడం దుర్మార్గమని పేర్కొన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్ కుమార్ రెడ్డి కూడా ఆలయాల పవిత్రతపై రాజకీయాలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు.

# రాజధానిపై జగన్‌ది గంటకో మాట

**రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**

**రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఆ 11 సీట్లు కూడా రావు**

**పెనుకొండలో రూ.40 లక్షల అభివృద్ధి పనులకు భూమిపూజ**

**పూల మార్కెట్ ప్రారంభించిన మంత్రి సవిత**





**పెనుకొండ మన జనప్రగతి ఏప్రిల్ 04:-** దేశం మొత్తం ఏపీ రాజధాని అమరావతి అని అంటుంటే... జగన్ మాత్రం గంటకో మాట మాట్లాడుతున్నాడు. ఒకసారి అమరావతే రాజధాని అంటారు.. మరోసారి మూడు రాజధానులంటారు... ఇంకోసారి మావిగన్ అంటారు... తాను ఉంటున్న లోటస్ పాండ్ ప్యాలెస్ కూడా రాజధానే అని అంటున్నారు... జగన్ కు మంచి వైద్యం అందించాలని స్వయాన వైసీపీ నాయకులు గొణుక్కుంటున్నారు ' అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. తన పార్టీ ఉనికి కోసమే జగన్ చేస్తున్న వ్యాఖ్యలను ప్రజలు పట్టించుకోవడంలేదన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజతో పాటు రూ.6 లక్షలతో నిర్మించిన ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఘనగిరి పూల మార్కెట్ ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పెనుకొండ పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. పూల వ్యాపారులను ప్రోత్సహించేలా పూల మార్కెట్ ను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు మెరుగైన పారిశుధ్య సౌకర్యాలు కల్పించేందుకు రూ.50 లక్షలతో శానిటేషన్ సెంటర్లను నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే రూ.5 కోట్లతో చేపట్టిన పనులు త్వరలో పూర్తి కానున్నాయన్నారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి మడకశిర రోడ్ వరకు కూడా సెంటర్ లైటింగ్ ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. **ఆ 11 సీట్లు కూడా రావు** విలేకరులకు అడిగిన ప్రశ్నకు మంత్రి సవిత స్పందిస్తూ... గంటకో మాట మార్చే వ్యక్తి జగన్ అని మండిపడ్డారు. దేశం మొత్తం ఏపీ రాజధాని అమరావతి అని అంటుంటే జగన్ మాత్రం గంటకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. ఒకసారి అమరావతే రాజధాని అంటారని, మరోసారి మూడు రాజధానులని, ఇంకోసారి మావిగన్ అని, తాను ఉంటున్న లోటస్ పాండ్ ప్యాలెస్ కూడా రాజధానే అని అంటున్నారని అన్నారు. ఇలా రాజధానిపై గంటకో మాట మాట్లాడే జగన్ కు మంచి వైద్యం అందించాలని స్వయాన వైసీపీ నాయకులు గొణుక్కుంటున్నారని మంత్రి సవిత అన్నారు. అమరావతి రైతులు, మహిళలను ఇబ్బందులకు గురిచేయడం వల్లే వైసీపీకి ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో గతంలో వచ్చిన సీట్లు కూడా రావని వ్యాఖ్యానించారు. గెలిచినప్పుడు ఒకలా, ఓడినప్పుడు మరోలా వ్యవహరించే వ్యక్తి జగన్ అని మంత్రి సవిత విమర్శించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# అమరావతికి ఒక న్యాయం రాయచోటికి మరో న్యాయమా?



**రాయచోటి మన జనప్రగతి ఏప్రిల్ 04:-** వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి ప్రశ్నించారు. అమరావతి కోసం రైతులకు అధిక పరిహారం, అభివృద్ధి ప్లాట్లు, చట్టపరమైన రక్షణ కల్పించారని తెలిపారు.అదే సమయంలో రాయచోటిని జిల్లా కేంద్రంగా ప్రకటించి, ప్రజలు ఇళ్లు, స్థలాలు కొనుగోలు చేసి వ్యాపారాలు ప్రారంభించగా, ఆకస్మికంగా జిల్లా కేంద్రం మార్పుతో రెండు లక్షలకుపైగా ప్రజలు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు, కార్మికులు, వలస కూలీలు సహా అన్ని వర్గాల ప్రజలకు ఇది అన్యాయం, ద్రోహమని విమర్శించారు. రాయచోటి ప్రజల బాధకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# రాజధానిపై జగన్ విధ్వంసం... అమరావతిపై చంద్రబాబు విజయం

**అమరావతిని ఆర్థిక శక్తిగా మార్చి రాష్ట్ర అభివృద్ధి**

**జగన్ విధ్వంసానికి చెక్... అమరావతి జయభేరి**

**పార్లమెంట్‌లో 50కి పైగా పార్టీల మద్దతుడ వైసీపీ వాకౌట్ షాక్**

**అభివృద్ధి చేసిన చంద్రబాబుడ అడ్డుకున్న జగన్**

**మూడు రాజధానుల పేరుతో మూడు ప్రాంతాల్లో చిచ్చు**

**విశ్వసనీయతపై మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు**

**జగన్‌పై విరుచుకుపడ్డ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**అమరావతి మన జనప్రగతి ఏప్రిల్ 04:-** రాష్ట్ర రాజధాని అమరావతి విషయంలో గత ఐదేళ్లలో జరిగిన పరిణామాలు చూస్తే జగన్ పాలన పూర్తిగా విధ్వంసానికి ప్రతీకగా నిలిచిందని, అదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అమరావతి పునర్నిర్మాణం విజయపథంలో దూసుకెళ్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు తెలియజేయడం ప్రభుత్వం బాధ్యత అని, గత వారం రోజులుగా 5 కోట్ల మంది ప్రజలు ఆనందోత్సవాలతో పండుగ చేసుకుంటున్నారని తెలిపారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో పార్లమెంట్, రాజ్యసభలో ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్, అయోధ్య రామమందిరం, జూామా, వక్ఫ్ బిల్లు సవరణ, మతమార్పిడి వ్యతిరేక చట్టాలు వంటి అనేక అంశాలపై రాజకీయ పార్టీల మధ్య విభేదాలు వచ్చినా ఎక్కడా ఏకాభిప్రాయం రాలేదని అన్నారు. అయితే అమరావతి చట్టబద్ధత విషయంలో దేశంలోని 50కి పైగా రాజకీయ పార్టీలు మద్దతు తెలపగా కేవలం వైసీపీ మాత్రమే వ్యతిరేకించి పార్లమెంట్‌లో వాకౌట్ చేసిందని విమర్శించారు. తెలుగు జాతి రాజధాని అమరావతిపై జగన్మోహన్ రెడ్డికి ఉన్న కక్ష చరిత్ర చూస్తే అర్థమవుతుందని, చంద్రబాబు ఎప్పుడూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా 5 కోట్ల మంది ఆంధ్రుల అభివృద్ధినే దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. 2014లో రాష్ట్ర విభజన సమయంలో కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు నష్టం జరగకుండా చివరి నిమిషం వరకు పోరాడిన నాయకుడు చంద్రబాబేనని గుర్తుచేసి, అడ్డగోలుగా రాష్ట్రాన్ని విడదీసి ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకుండా చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రాంతాలు, వర్గాల మధ్య విభేదాలు రాకుండా అన్ని రాజకీయ పార్టీలను ఒక తాటిపైకి తీసుకొచ్చి, హైదరాబాద్‌లో 13 గంటల పాటు ఎమ్మెల్యేలతో చర్చలు జరిపి అందరి అభిప్రాయంతోనే అమరావతిని రాజధానిగా ప్రకటించారని తెలిపారు. ఆ సమయంలో వైసీపీ కూడా అమరావతికి సంపూర్ణ మద్దతు తెలిపిందని, "ఇక్కడే ఇల్లు కట్టుకుంటాను, రాజధానిని మార్చను" అన్న జగన్ అధికారంలోకి వచ్చాక మాట మార్చి అమరావతిని శ్మశానం, ఎడారి అంటూ దూషించారని, ఒక జాతి, కులంపై నీచ వ్యాఖ్యలు చేయించారని మండిపడ్డారు. అమరావతిలో అవినీతి జరిగిందని ఆరోపించినా ఒక్కటి కూడా నిరూపించలేకపోయారని అన్నారు. మూడు రాజధానుల పేరుతో రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టారని, విశ్వసనీయత గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదని, రాజధాని విషయంలో తొమ్మిది సార్లు మాట మార్చారని విమర్శించారు. అమరావతి తెలుగు ప్రజల భవిష్యత్తు అని స్పష్టం చేసిన అచ్చెన్నాయుడు, అమరావతిని ఆర్థిక శక్తిగా మార్చి అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174